

## పందెం కోళ్లు

- సంక్రాంతికి సిద్ధం
- గోదావరి జిల్లాల్లో మాదిరి బహిరంగంగా కాకుండా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోగోప్యంగా నిర్వహణ
- ఒక్కొక్క పుంజు కనిష్ఠంగా రూ.15 వేలు, గరిష్ఠంగా రూ.లక్షపైనే

· 5లో



# బస్టాండ్, రైల్వేస్టేషన్ కిటకిట

**సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత ఊళ్లకు పయనం**

- ప్రయాణికులతో కిక్కిరిసిన రైళ్లు, బస్సులు
- ప్రత్యేక సర్వీసులు నడిపిన ఆర్టీసీ



రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌లోకి ఎక్కుతున్న ప్రయాణికులు



అనకాపల్లి పీటీడీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

**అనకాపల్లి టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) :** సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికులతో అనకాపల్లి రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీగా మారాయి. ఉద్యోగం, ఉపాధి, వ్యాపార రీత్యా అనకాపల్లిలో నివాసం ఉంటున్న వారిలో చాలా మంది సంక్రాంతి పండుగను సొంతూళ్లలో చేసుకోవడానికి ప్రయాణం కావడంతో రైళ్లు, బస్సులు కిటకిటలాడాయి. జన్మభూమి, సింహాద్రి, ప్రశాంతి, రత్నాచల్, మెయిల్, తిరుమల, గోదావరి ఎక్స్‌ప్రెస్‌లలో సాధారణ బోగీల్లో చాలా మంది నిల్చుని ప్రయాణించాల్సి వచ్చింది. అదే విధంగా అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన పలువురు ఉద్యోగ, ఉపాధి, ఉన్నత చదువుల నిమిత్తం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విజయవాడ, కాకినాడ, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లో వుంటున్నారు. వీరు వివిధ రైళ్లు, బస్సుల్లో అనకాపల్లి చేరుకుని, ఇక్కడ నుంచి ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాల్లో గమ్యస్థానాలకు బయలుదేరి వెళ్లారు. కాగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అనకాపల్లి నుంచి విజయవాడకు రెండు, పాయకరావుపేటకు రెండు, రాజమహేంద్రవరం, అన్నవరం ప్రాంతాలకు ఒక్కొక్కటి చొప్పున అదనపు బస్సులు నడిపినట్టు పీటీడీ ఏడీఎం రవిచంద్ర తెలిపారు.

## రవాణా శాఖ స్పెషల్ డ్రైవ్

- ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో తనిఖీలు
- నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్టు నిర్ధారణ
- 80 బస్సులపై కేసులు, రూ.14 లక్షలు జరిమానా

**అనకాపల్లి రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):** సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల డిమాండ్‌ను ఆసరాగా తీసుకుని అధిక చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై జిల్లా రవాణా అధికారి జి.మనోహర్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా ఆరు బృందాలను ఏర్పాటు చేసి జిల్లాలో పాయకరావుపేట నుంచి సబ్బవరం వరకు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. నిబంధనలు అతిక్రమించి ప్రయాణికుల నుంచి ఎక్కువ చార్జీలు వసూలు చేస్తున్న పలు బస్సులపై కేసులు నమోదు చేశారు. ఈ నెల పదో తేదీ నుంచి 12వ తేదీ వరకు 80 ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు చేసి రూ.14 లక్షలు జరిమానా విధించారు. ఈ నెల 20వ తేదీ వరకు ప్రత్యేక బృందాలు తనిఖీలు చేస్తాయని ఆయన చెప్పారు.



ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల రికార్డులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు



కచ్చిలి చేపలు

## మత్స్యకారుల గేలాలకు అరుదైన చేపలు

**ఒకటి 26 కిలోలు, మరొకటి 16 కిలోలు**

- ఔషధ గుణాలు ఉండడంతో గిరాకీ
- రెండూ కలిపి రూ.2.4 లక్షలకు కొనుగోలు చేసిన ఎగుమతి వ్యాపారి

**అచ్యుతాపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):** పూడిమడక మత్స్యకారుల గేలానికి అరుదైన చేపలు చిక్కాయి. ఔషధ గుణాలున్న వీటిని స్థానికంగా 'కచ్చలి' చేపలుగా పిలుస్తుంటారు. 42 కిలోల బరువున్న రెండు చేపలను అదే గ్రామానికి చెందిన చేపల వ్యాపారి ఉమ్మిడి కొండయ్య రూ.2.4 లక్షలకు కొనుగోలు చేశారు.

పూడిమడకకు చెందిన ఏడుగురు మత్స్యకారులు మూడు రోజుల క్రితం సముద్రంలోచేపల వేటకు వెళ్లారు. అధిక విలువ చేసే ఔషధ గుణాలు వున్న కచ్చిలి జాతి చేపలను లక్ష్యంగా చేసుకుని వేట సాగించారు. ఇతర రకాలతో పాటు రెండు కచ్చిలి రకం చేపలు చిక్కాయి. వేట ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం పూడిమడక తీరానికి చేరుకున్నారు. కచ్చిలి చేపల్లో ఒకటి 26 కిలోలు, మరొకటి 16 కిలోల బరువు తూగాయి. వీటిని స్థానికుడైన చేపల ఎగుమతి వ్యాపారి కొండయ్య రూ.2.4 లక్షలకు కొనుగోలు చేశారు. వీటిని చెన్నైలోని ఒక కంపెనీకి పంపుతానని, ఔషధ గుణాలు వుండడంతో కచ్చిలి చేపలకు గిరాకీ ఎక్కువగా వుంటుందని ఆయన చెప్పారు.

**తిరుపతి తొక్కిసలాట మృతుల కుటుంబాలకు**

# టీటీడీ అన్ని విధాలా అండ

**స్పీకర్ అయ్యన్నపాత్రుడు**

- నాయుడుబాబు భార్యకు రూ.25 లక్షల చెక్కు అందజేత
- క్షతగాత్రులకు అనకాపల్లిలో రూ.2 లక్షల చొప్పున చెక్కులు పంపిణీ



బొడ్డేడ నాయుడుబాబు భార్య మణికుమారికి రూ.25 లక్షల చెక్కు అందిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు. చిత్రంలో టీటీడీ పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, జంగా కృష్ణమూర్తి, తదితరులు వున్నారు

**నర్సీపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):** వైకుంఠ ఏకాదశికి వేంకటేశ్వరస్వామి దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో మృతిచెందిన వారి కుటుంబాలను టీటీడీ అన్ని విధాలా ఆదుకుంటుందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. నర్సీపట్నం మునిసిపాలిటీలోని పెదబొడ్డేపల్లి ప్రాంతానికి చెందిన బొడ్డేడ నాయుడుబాబు ఈ నెల ఎనిమిదో తేదీ రాత్రి తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయనతోపాటు మరో ఐదుగురు కూడా ఈ ఘటనలో మృతిచెందగా.. ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియాను టీటీడీ ప్రకటించింది. ఈ మేరకు చెక్కును ఆదివారం ఇక్కడ నాయుడుబాబు భార్య మణికుమారికి స్పీకర్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మృతుల కుటుంబాల్లో అర్హులైన వారికి టీటీడీలో కాంట్రాక్టు విధానంలో ఉద్యోగం కూడా ఇస్తున్నారన్నారు. చదుకునే పిల్లలు ఉంటే వారికి ఉన్నత చదువుల వరకూ టీటీడీ బాధ్యత తీసుకుంటుందన్నారు. టీటీడీ పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ, తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన వారికి రూ.5 లక్షలు, స్వల్ప గాయాలైన వారికి రూ.2 లక్షల చొప్పున 21 మందికి అందించామన్నారు. టీటీడీ పాలకమండలి సభ్యులు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి.. మృతుల కుటుంబాలకు రూ.2 రెండు లక్షల చొప్పున మరో సభ్యుడు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు రూ.50 వేల చొప్పున అందించారన్నారు. మృతుల్లో తెలుగుదేశం పార్టీ క్రియాశీల సభ్యులు వుంటే రూ.5 లక్షలు బీమా పరిహారంగా అందుతుందని చెప్పారు. టీటీడీ పాలకమండలి సభ్యులు పనబాక లక్ష్మి, జంగా కృష్ణమూర్తి, ఎంఎస్ రాజు, కోటేశ్వరరావు, మహేందర్‌రెడ్డి, జానకిదేవి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, కౌన్సిలర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు

**క్షతగాత్రులకు రూ.2 లక్షల చొప్పున..**

**కొత్తూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):** తిరుపతిలో ఈ నెల 8వ తేదీన జరిగిన తొక్కిసలాటలో గాయపడిన వారికి రూ.2 లక్షల చొప్పున చెక్కులను ఆదివారం టీటీడీ పాలకమండలి సభ్యులు, అనకాపల్లి ఎమ్మెల్యే అందజేశారు. తొలుత గవరపాలెం సతకంపట్టు సమీపంలో ఉన్న బాధితులను కలిసి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కూటమి ... మిగతా 4వ పేజీలో



కార్యక్రమానికి హాజరైన మేలు కొలుపు భజన బృందాల సభ్యులు. (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న హిందూ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాధా మనోహర్ దాస్

## హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి

**సర్వ మతాలను గౌరవిస్తున్న హిందూ ధర్మంపై దుష్ప్రచారం బాధాకరం**

**హిందూ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాధా మనోహర్ దాస్**

**రావికమతం, జనవరి 12, (ఆంధ్రజ్యోతి):** హిందూత్వాన్ని, హిందూ ధర్మాన్ని హైందవులే కాపాడుకోవాలని హిందూ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాధా మనోహర్ దాస్ పిలుపునిచ్చారు. రావికమతం, బుచ్చెయ్యపేట మండలాలకు చెందిన భజన బృందాలు సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన మేలుకొలుపు కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా మండలంలోని ఆర్.కొత్తూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన విశిష్ట అతిథిగా హాజరై అభిభాషణ చేశారు. సర్వ మతాలను గౌరవిస్తున్న హిందూ ధర్మంపై దుష్ప్రచారం, అణచివేత వంటివి జరగడం బాధాకరమని అన్నారు. చిన్నప్పటి నుంచే పిల్లలకు ఆధ్యాత్మిక చింతన, సనాతన ధర్మం, దేవాలయాల విశిష్టత, హిందువుల చరిత్ర గురించి తెలియజేయాలన్నారు. అంతకుముందు పుర వీధుల్లో భజన బృందాల సభ్యులు హరినామ సంకీర్తనలు, భక్తి పాటలు ఆలపిస్తూ మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు.

# రక్షణ లేని భవనాలు

**శిథిలావస్థకు చేరిన తుఫాన్ షెల్టర్లు**

- ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని వైనం
- ఎప్పుడు కూలిపోతాయోనని స్థానికులు భయాందోళన
- వెంటనే నేలమట్టం చేయించాలని వినతి

**రాంబిల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):** తుఫాన్లు, సునామీలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజల రక్షణ కోసం నిర్మించిన భవనాలు.. ఇప్పుడు ప్రజలకు ప్రాణసంకటంగా మారాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాలకు ఏళ్ల తరబడి మరమ్మతులు చేయకపోవంతో శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతాయో అన్న విధంగా తయారయ్యాయి. భవనాలకు మరమ్మతులు అయినా చేయండి, లేదంటే నేలమట్టం అయినా చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదని సముద్ర తీర గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కొండవారపాలెంలో తుఫాన్ షెల్టర్ దుస్థితి!

రాంబిల్లి మండలంలో గొరపూడి, రాజుకోడూరు, గజిరెడ్డిపాలెం, కొండవారపాలెం, రాంబిల్లి, వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాల్లో చాలా ఏళ్ల క్రితం ప్రభుత్వం తుఫాన్ రక్షిత భవనాలు నిర్మించింది. బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండాలు ఏర్పడినప్పుడు, తుఫాన్లు సంభవించినప్పుడు ముందు జాగ్రత్త చర్యగా అధికారులు ఆయా గ్రామాల ప్రజలను తుఫాన్ రక్షిత భవనాల్లోకి తరలించి ఆహారం, తాగునీరు వంటి వాటిని అందించేవారు. అయితే నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపాలతోపాటు సముద్ర తీర ప్రాంతం కావడంతో ఉప్పు గాలులకు భవనాలు త్వరగా పాడైపోతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో క్రమేణా శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్నిచోట్ల నివాసాలకు, పాఠశాలలకు చేరువలో వుండి, ఆందోళన కలిగిస్తున్నాయి. గజిరెడ్డిపాలెం, వాడనర్సాపురం గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన తుఫాన్ రక్షిత భవనాలు.. ప్రభుత్వ పాఠశాలలు పక్కనే వున్నాయి. ఏ క్షణంలో కూలిపోతాయో తెలియని విధంగా వుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. శిథిలావస్థకు చేరిన ఈ భవనాలను తొలగించాలని పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

**దళాయిపాలెంలో...**


**పరవాడ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) :** మండలంలో వాడ చీపురుపల్లి పంచాయతీ పరిధి దళాయిపాలెంలో తుఫాన్ రక్షిత భవనం పూర్తిగా ... మిగతా 4వ పేజీలో



కొత్తపట్నంలో అధ్వానంగా ఉన్న తుఫాన్ భవనం

## ధారకొండ ఘాట్‌లో పులి సంచారం

- రెయిన్‌గేజ్ వద్ద రోడ్డు మధ్యలో కనిపించడంతో ఉలిక్కిపడిన బస్సు డ్రైవర్, ప్రయాణికులు



దారాలమ్మ ఘాట్ రోడ్డు రెయిన్‌గేజ్ సమీపంలో ఆదివారం ఉదయం రోడ్డు దాటుతున్న పులి

**సీలేరు, జనవరి 12 (జనవరి):** అల్లూరి సీతారామరాజు జిల్లా జీకేవీధి మండలం ధారాలమ్మ ఘాట్ రోడ్డు రెయిన్‌గేజ్ సమీపంలో ఆదివారం ఉదయం పులి సంచరించడం కలకలం రేపింది. గత 20 సంవత్సరాల్లో సీలేరు, ఆర్వీనగర్ రేంజ్ పరిధిలో పులులు సంచరించిన దాఖలాలు లేవు. అయితే ఆదివారం ఉదయం ఆరు గంటల సమయంలో డొంకరాయి నుంచి పాడేరు వెళుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు ధారకొండ ఘాట్ రోడ్డులోని రెయిన్‌గేజ్ సమీపంలో పులి కనిపించింది. రోడ్డుకు అడ్డంగా ఉండడంతో డ్రైవర్ కంగారు పడి కేకలు వేయడంతో ప్రయాణికులు అప్రమత్తమయ్యారు. కిటికీల్లో నుంచి సెల్‌ఫోన్‌లతో ఫొటోలు తీశారు. బస్సు డ్రైవర్ హారన్ కొట్టడంతో పులి సమీపంలోని పొదల్లోకి వెళ్లిపోయింది. ప్రయాణికులు తీసిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ కావడంతో విషయం తెలుసుకున్న సీలేరు అటవీ శాఖ డీఆర్వో చిట్టపులి సింహాచలంపడాల్ ఆధ్వర్యంలో సిబ్బంది ధారాలమ్మ ఘాట్ రోడ్డు నుంచి రెయిన్‌గేజ్ వరకు పులి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రెయిన్‌గేజ్ వ్యూపాయింట్ నుంచి కొండల్లోకి వెళ్లిపోయినట్టు అడుగుల గుర్తుల ద్వారా నిర్ధారించుకున్నట్టు అటవీ శాఖ సిబ్బంది తెలిపారు.

## వెటర్నరీ డాక్టర్ త్రిపాత్రాభినయం!

**నాతవరం మండలంలో మూడు పశువైద్యశాలలు**

- రెండుచోట్ల వైద్యులు లేని దుస్థితి
- మిగిలిన ఒక్కడాక్టర్‌తోనే మూడు ఆస్పత్రుల్లో సేవలు



వెటర్నరీ డాక్టర్ లేని నాతవరం పశువైద్య కేంద్రం

**నాతవరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):** వెటర్నరీ డాక్టర్లు సాధారణంగా ఒక పశువైద్య శాలలోనే విధులు నిర్వర్తిస్తుంటారు. పక్కవైద్యశాలలో డాక్టర్ పోస్టు ఖాళీగా వుంటే.. కొద్ది రోజులపాటు అక్కడ ఇన్‌చార్జిగా పనిచేస్తుంటారు. కానీ నాతవరం మండలంలో ఒక వెటర్నరీ డాక్టర్ మూడు పశువైద్య కేంద్రాల్లో సేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఏ ఒక్క కేంద్రం పరిధిలో కూడా పశువులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందని పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే..

నాతవరం మండలంలో మూడుచోట్ల (నాతవరం, శృంగవరం, గునుపూడి) పశువైద్యశాలలు వున్నాయి. ప్రతి ఆస్పత్రిలో డాక్టర్, వెటర్నరీ అసిస్టెంట్, అటెండర్ వుండాలి. కానీ నాతవరం మండలంలో చాలా ఏళ్ల నుంచి పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది లేరు. నాతవరం పశువైద్య కేంద్రంలో విధులు నిర్వహించే డాక్టరు, వెటర్నరీ అసిస్టెంట్ ఏడాదిన్నర క్రితం సాధారణ బదిలీల్లో భాగంగా వేరే ప్రదేశాలకు వెళ్లిపోయారు. వీరిస్థానంలో ప్రభుత్వం ఎవరినీ నియమించలేదు. కొన్నాళ్లపాటు గోపాలమిత్ర పెద్దదిక్కు అయ్యారు. వెటర్నరీ డాక్టర్‌ను నియమించాలని రైతులు కోరగా.. గునుపూడి పశువైద్య కేంద్రం డాక్టర్ మోక్షరెడ్డిని నాతవరం ... మిగతా 4వ పేజీలో

## బాలికపై అత్యాచారం

ఎలమంచిలి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒక గ్రామంలో శనివారం ఐదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన 14 సంవత్సరాల బాలుడు అత్యాచారం చేసినట్టు రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు. ఈ ఘటనపై పరవాడ డీఎస్పీ సత్యనారాయణ ఆదివారం గ్రామానికి వెళ్లి విచారణ చేశారని ఆయన తెలిపారు. బాలిక తల్లిదండ్రులు పనికి వెళ్లిన సమయంలో 14 ఏళ్ల బాలుడు అత్యాచారం చేసినట్టు పోలీసులు తెలిపారు. ఈ విషయాన్ని బాలిక తన అత్తకు చెప్పింది. అనంతరం తల్లిదండ్రులకు వివరించడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదుపై పూర్తి విచారణ కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.

## పాడి రైతులకు సంక్రాంతి బోనస్ పంపిణీ

అచ్యుతాపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పాడిరైతుల ఆర్థికాభివృద్ధే తమ ధ్యేయమని హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేష అన్నారు. ఆదివారం మండలంలోని మునలమ్మపాలెంలో గల 43 మంది పాడి రైతులకు ఆయన రూ.2.65 లక్షల సంక్రాంతి బోనస్‌ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధర్మిరెడ్డి అప్పన్నదొర, లాలం సోంబాబు, డి. అప్పలనాయుడు, కూండ్రపు సన్నిబాబు, రమణమ్మ, రామతల్లి. తదితరులు పాల్గొన్నారు.

## మండిన నిత్యావసరాల ధరలు

- సలసల కాగిన వంట నూనెలు
- పప్పుల సంగతి చెప్పనక్కరలేదు..
- తగ్గిన పిండి వంటల తయారీ

అచ్యుతాపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి నిత్యావసర వస్తువుల ధరలు మండుతున్నాయి. పెద్ద పండగకు గ్రామీణ ప్రాంతాల్లో పిండివంటలు చేయడం ఆనవాయితీ. అయితే ధరలు పెరగడంతో తక్కువగా చేసుకుంటున్నారు. భోగికి ముందు ఆదివారం రావడంతో చాలా గ్రామాల్లో పిండివంటలు వండడం కనిపించింది. పిండి వంటలకు ఉపయోగించే శనగపప్పు కేజీ వంద, మినప పప్పు రూ.125, పెసరపప్పు రూ.120. కందిపప్పు రూ.150 ధరలు పలుకుతున్నాయి. గారెలు, చక్కిలాల్లో వాడే నువ్వులు రూ.220, శనగపలుకులు (పల్లీలు)రూ.120, అరిసెలకు వాడే బెల్లం రూ.50 పలుకుతున్నాయి. దీంతో గ్రామీణులు పరిమితి మేరకు కొనుగోలు చేసి సంప్రదాయం పోకుండా వంటలను పరిమితి చేశారు. ఇక ఏ వంటైనా నూనెతోనే ప్రారంభమవుతుంది. అలాంటిది పండగ వంటలకు ఎక్కువగా నూనెని వినియోగిస్తారు. పండగకు వంట నూనెల ధరలు సలసల కాగుతున్నాయి. వేరుశనగ నూనె కేజీ రూ. 180, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.165, పామాయిల్ రూ.130కి విక్రయిస్తున్నారు. వెల్లుల్లి కేజీ.రూ.260 కి విక్రయిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో చాలా గ్రామాల్లో అల్లుళ్లు, కూతుర్లు శనివారం రాత్రికే ఇళ్లకు చేరుకున్నారు. దీంతో ఆదివారం ఉదయం నుంచి చాలా గ్రామాల్లో ఇళ్ల నుంచి ఘుమఘుమలు వెదజల్లాయి.

## టీటీడీ అన్ని విధాలా అండ

... 3వ పేజీ తరువాయి



క్షతగాత్రులకు చెక్కులు అందజేస్తున్న టీటీడీ పాలకమండలి సభ్యులు

ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనకాపల్లి పట్టణంలోని గవరపాలేనికి చెందిన యల్లపు హిమబిందు, అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీ మూలపేట గ్రామానికి చెందిన ఆకుల యశ్వంత్, పరవాడ మండలం జోగివానిపాలెం గ్రామానికి చెందిన ఉయ్యూరు మాధవిలకు రూ.2 లక్షల చొప్పున చెక్కులు అందిచారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, టీటీడీ పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ, ఎం.ఎస్.రాజు, పనబాక లక్ష్మి, జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద, తాతయ్యబాబు, సీనియర్ నాయకులు బుద్ద నాగజగదీశ్వరరావు, దాడి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రక్షణ లేని భవనాలు

... 3వ పేజీ తరువాయి



దళాయిపాలెంలో కూలడానికి సిద్దంగా ఉన్న తుఫాన్ షెల్టర్

పాడైపోయింది. సుమారు 45 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం శిథిలావస్థకుచేరింది. గోడలన్నీ బీటలు వారాయి. శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. తలుపులు, కిటికీలు చెద పట్టేశాయి. భవనం చుట్టూ ముళ్లపొదలు పెరిగిపోయాయి. యువకులు, విద్యార్థులు ఖాళీ సమయాల్లో ఇక్కడ ఆటలాడుతుంటారు. ఈ సమయంలో భవనం కూలితే ప్రాణనష్టం జరుగుతుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శిథిలమైన ఈ భవనాన్ని సత్వరమే కూల్చివేయాలని కోరుతున్నారు.

## వెటర్నరీ డాక్టర్ త్రిపాత్రాభినయం!

... 3వ పేజీ తరువాయి

పశువైద్య కేంద్రానికి ఇన్‌చార్జిగా నియమించారు. మరోవైపు ఇదే మండలంలోని శృంగవరం పశువైద్య కేంద్రంలో కూడా డాక్టర్ లేకపోవడంతో గునుపూడి డాక్టర్‌నే ఇక్కడ కూడా ఇన్‌చార్జిగా నియమించారు. డాక్టర్ మోక్షరెడ్డి సోమ, మంగళవారాలు గునుపూడిలో, బుధ, గురు, శుక్రవారాలు నాతవరంలో, శనివారం శృంగవరంలో వైద్యసేవలు అందిస్తున్నారు. మండలం మొత్తం ఒకే ఒక్క వెటర్నరీ డాక్టర్ వుండడంతో తమ పశువులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడంలేదని పలుగ్రామాల రైతులు వాపోతున్నారు. ల్లా అధికారులు స్పందించి అన్ని పశువైద్యశాలలకు పూర్తిస్థాయిలో వైద్యులను, సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

# ‘పేట’లో సంక్రాంతి సందడి

- జనాలతో రద్దీగా ఉన్న దుకాణాలు
- ప్రజలకు తప్పని ట్రాఫిక్ కష్టాలు

పాయకరావుపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి ఆదివారం నుంచే సంక్రాంతి వచ్చేసింది. స్థానిక తాండవ వంతెనతోపాటు మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాపులన్నీ కస్టమర్లను ఆకర్షించేవిధంగా విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్నాయి. సంక్రాంతి సందర్భంగా పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో బంధువులు, స్నేహితులు, వలస కూలీలు ఇళ్లకు చేరడంతో ప్రతి ఇంటా పిల్లల ఆటపాటలు, బంధువులతో సందడిగా ఉంది. పండగకు నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన ప్రజానీకంతో వ్యాపార సంస్థలు, సినిమా థియేటర్లు కిటకిటలాడుతున్నాయి. గ్రామాల నుంచి పట్టణానికి ప్రయాణికులతో వస్తున్న ఆటోలు మెయిన్‌రోడ్డులోని ఎక్కడపడితే అక్కడే ఆపుతుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది. ధనుర్మాసం ప్రారంభం నుంచి హరిదాసులు పట్టణంలో స్వయంపాకం అందుకుంటున్నారు. పలు గ్రామాల్లోని శివారు ప్రాంతాలు, తీర ప్రాంతంలోని తోటల్లో చాటుమాటుగా కోడి పందాలు, గుండాటల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇక పేకాటరాయుళ్ల సంగతి చెప్పనక్కర్లేదు. మందుబాబులకు అప్పుడే పండగ వచ్చేసింది. పండుగను పురస్కరించుకుని ఈ ఏడాది వంటనూనె, పప్పు, ఉప్పు తదితర కిరాణా సరుకుల ధరలు బాగా పెంచేశారు. పలువురు వ్యాపారులు కోటా బియ్యాన్ని పాలిష్‌చేసి బ్రాండ్ నేమ్ ఉన్న



జనాలు, వాహనాలతో రద్దీగా ఉన్న పాయకరావుపేట

సంచుల్లో ప్యాక్ చేసి బీపీటీలతో సమానంగా విక్రయిస్తున్నారు. తూనికలు, కొలతలు, ప్రజారోగ్యం, సేల్స్ ట్యాక్స్ తదితర ప్రభుత్వ శాఖలు ఎక్కడున్నాయో ఎవరికీ తెలియక పోవడంతో తూకం, నాణ్యత, ఎమ్మార్పీ రేట్లలో ఘరానా మోసం జరుగుతున్నా పట్టించుకున్నవారు లేరని పలువురు వాపోతున్నారు.

# న్యాయంపూడిలో రూ.కోటితో అభివృద్ధి పనులు ప్రారంభం

నక్కపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యాయంపూడి గ్రామంలో రూ.కోటితో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆదివారం సాయంత్రం హోం శాఖ మంత్రి అనిత శంకుస్థాపన చేశారు. అలాగే ఉపాధి హామీ పథకంలో నిర్మించిన రహదారిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో నక్కపల్లి పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని, స్టీల్‌ప్లాంట్, బల్క్‌డ్రగ్ పార్కుతో ఎంతో మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే 3,525కి.మీ మేర రహదారులు వేశామని చెప్పారు. అనేక రహదారుల గుంతలు పూడ్చామన్నారు. పోలీసులకు సరెండర్ లీవ్‌లకు సంబంధించిన చెల్లింపులు 11వ తేదీనే పూర్తి చేశామన్నారు. గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత

### టీడీపీ గూటికి న్యాయంపూడి సర్పంచ్

మండలంలోని న్యాయంపూడి గ్రామ సర్పంచ్ రెడ్డి వరహాలు రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సమక్షంలో టీడీపీలో చేరారు. ఇటీవల ఈ గ్రామానికి సమృద్ధి నీటి సరఫరా విభాగంలో జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీ పురస్కారం లభించింది. ఈ గ్రామాభివృద్ధికి తన సహకారం పూర్తిగా వుంటుందని మంత్రి హామీ ఇచ్చారు.

## బల్క్‌డ్రగ్‌కు వ్యతిరేకంగా ఆందోళన

నక్కపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంతానికి, మత్స్యకారులు, రైతాంగానికి హాని కలిగించే బల్క్‌డ్రగ్ పార్కును నక్కపల్లి మండలంలో ఏర్పాటు చేయవద్దని మత్స్యకార నాయకులు, వైసీపీ, సీపీఎం నాయకులు చెప్పారు. ఆదివారం రాజయ్యపేట గ్రామంలో బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా ఆందోళన, నిరసన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు కె.లోకనాథం, వైసీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ.. ఈనెల 8వ తేదీన ప్రధాని మోదీ వర్చువల్ శంకుస్థాపన చేయడాన్ని కూడా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ పోరాటాన్ని అన్ని పార్టీల వారు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు పిక్కి గంగరాజు, పిక్కి కోదండరావు, పిక్కి సత్తియ్య, పిక్కి దేముడు, పిక్కి తాతీలు, పిక్కి స్వామి, ఎరుపల్లి నాగేశ్, ఎం.రాజేశ్ పాల్గొన్నారు.



రాజయ్యపేటలో మానవహారం చేస్తున్న దృశ్యం

## నేడు గోదాదేవి కల్యాణం

- గజ వాహనంపై గరుడాచల వాసుని తిరువీధి

నక్కపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం గోదాదేవి అమ్మవారి కల్యాణోత్సవం ఘనంగా జరుగుతుందని ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు చెప్పారు. ఆలయానికి ఆనుకుని వున్న స్వామివారి పుష్పతోటలో గోదా, రంగనాధుల కల్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఆదివారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పుష్పతోటలో గోదాదేవి అమ్మవారికి ఆలయ సంప్రదాయాల ప్రకారం పూజలు చేశారు. అనంతరం గజ వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవమూర్తులను, పల్లకీలో గోదాదేవి అమ్మవారిని వుంచి మాడవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.



గజ వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ

# స్వామి వివేకానందునికి ఘన నివాళి

అచ్యుతాపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద 162వ జయంతిని పూడిమడక శివారు కడపాలెంలో స్వామి వివేకానంద స్వచ్ఛంద ఆర్గనైజేషన్ ఆదివారం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. అనంతరం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు దుప్పట్లు, చిన్నారులకు స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చోడిపల్లి అప్పారావు, మేరుగు అప్పలనాయుడు, వాసుపల్లి శ్రీనివాసరావు, ఉమ్మిడి అప్పారావు, జగన్, మేరుగు నూకరాజు, దాసరి శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే అచ్యుతాపురం శాఖ గ్రంథాలయంలో వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి వక్తలు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో అచ్యుత విద్యాసంస్థల కరస్పాండెంట్ పల్లి శేషగిరిరావు, గ్రంథాలయాధికారి బి. కోటేశ్వరరావు, మారిశెట్టి వెంకట అప్పారావు, లాలం అప్పలనాయుడు పాల్గొన్నారు.



రాంబిల్లి: వాడనర్సాపురంలో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

**ఎలమంచిలిలో..**

మునిసిపాలిటీలోని కొత్తపాలెంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా జరుపుకున్నారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు ఏవి.రెడ్డినాయుడు, ఆడారి బాస్కరావులు మాట్లాడుతూ స్వామి వివేకానంద భారత దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన మహనీయుడు అన్నారు. కార్యక్రమంలో స్థానికులు ఆడారి జగన్నాథరావు, బొడ్డేటి సంతోష్, ఆడారి జోగేశ్వరావు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

**మునగపాకలో..**

మండలంలో తోటాడ జడ్పీ హైస్కూల్‌లో స్వామి వివేకానంద జయంతిని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. 1992-93 టెన్త్ బ్యాచ్ పూర్వపు విద్యార్థుల ఆధ్వర్యంలో పాఠశాలలో యువజనోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా వివేకానంద విగ్రహం వద్ద సర్పంచ్ దొడ్డి మంగవేణి, కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు కాండ్రేగుల వెంకటలక్ష్మి, పూర్వపు విద్యార్థులు నివాళులర్పించారు.



మునగపాక: తోటాడలో వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

**రాంబిల్లిలో..**

మండలంలోని వాడనర్సాపురం గ్రామంలో ఆదివారం నేను, నా స్నేహం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కారే రామారావు, మాజీ సర్పంచ్ చింతకాయల ఎర్రయ్య, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, ఆర్‌వైడీఎస్ కార్యదర్శి సూరాడ నూకరాజు, టీడీపీ మండల ఉపాధ్యక్షులు సూరాడ అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

అచ్యుతాపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంజేపురం జెడ్‌పీ ఉన్నత పాఠశాలలో 2010-11వ సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అదే పాఠశాలలో ఆదివారం కలుసుకున్నారు. ఈ ఆత్మీయ కలయికకు అప్పుడు వారికి బోధించిన ఉపాధ్యాయులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భీముని హేమశివ నాయుడు, ఉల్లింగల శ్రీను, కాండ్రేగుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎంజేపురంలో కలిసిన పూర్వ విద్యార్థులు

## బొద్దపు శ్రీనును పరామర్శించిన ప్రగడ, పప్పల

ఎలమంచిలి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం పెదపల్లిలో ఆయన స్వగృహానికి ఏపీఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు వెళ్లి పరామర్శించారు. శ్రీను ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రాజాన సూర్యనాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ పాల్గొన్నారు.



పెదపల్లిలో బొద్దపు శ్రీనివాసరావును పరామర్శిస్తున్న ఏపీఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు

## వాడవాడలా భోగి పండగకు ఏర్పాట్లు

ఎలమంచిలి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): భోగి మంటలు వేసేందుకు పట్టణంతోపాటు మండలంలోని గ్రామాలు సిద్ధమయ్యాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి జరిగే భోగి పండగకు యువత అన్ని ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని మిలట్రీ కాలనీ, కొత్తపేట, ఆర్ఎస్.రోడ్డు, తులసీనగర్, కాకివాని వీధి, ధర్మవరం ప్రాంతం, శ్రీరామచంద్రమ్మ కాలనీ, కొక్కిరాపల్లి, పెదపల్లి, యర్రవరం, సోమలింగపాలెం ప్రాంతాల్లో యువ కులు కలప దుంగలు, కర్రలు సిద్ధం చేశారు. రెండు రోజుల ముందు నుంచే యువత ఏర్పాట్లు చేశారు.



ఎలమంచిలి కొత్తపేట వీధిలో భోగి మంటకు సిద్దం చేసిన కలప

## బైకులు ఢీ : ఒకరి మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు...
- ఒకరి పరిస్థితి విషమం

ఎస్.రాయవరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రాజుపేట జంక్షన్‌కు సమీపంలో శనివారం రాత్రి పదిన్నర గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పల్లేటి జగదీశ్ (19) మృతి చెందగా.. మరో ముగ్గురు గాయపడ్డారని ఎస్ఐ విభీషణరావు ఆదివారం తెలిపారు. ఎస్ఐ, గ్రామస్థులు అందించిన వివరాలిలా ఉన్నాయి.

కొత్త రేవుపోలవరం గ్రామానికి చెందిన పల్లేటి జగదీష్, ఎరిపిల్లి వాసు బైకుపై షాపింగ్ నిమిత్తం శనివారం సాయంత్రం అడ్డరోడ్డు వెళ్లారు. రాత్రి తిరిగి ఇంటికి వస్తుండగా గుర్రాజుపేట జంక్షన్ దాటిన తర్వాత ముందు వెళుతున్న అదే గ్రామానికి చెందిన కోసూరి హర్షిత్, పి.ఇజ్రాయిల్ బైక్‌ను వెనుక నుంచి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో పల్లెటి జగదీశ్ (19) అక్కడికక్కడే మృతి చెందగా.. ఎరిపిల్లి వాసు, కోసూరి హర్షిత్‌లకు తీవ్ర గాయాలు కాగా.. పి. ఇజ్రాయిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. దీంతో వాసును కుటుంబ సభ్యులు అనకాపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా.. హర్షిత్‌ను విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో జాయిన్ చేశారు. వాసు ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం కాస్త బాగానే ఉన్నప్పటికీ.. హర్షిత్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్టు ఆ గ్రామస్థులు తెలిపారు. మృతుడు జగదీశ్ కేరళలో నెట్స్ వ్యాపారం చేస్తున్నాడు. తన కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి పండగ జరుపుకోవడం కోసం ఈనెల ఒకటో తేదీన స్వగ్రామం వచ్చాడు. విశాఖలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు హర్షిత్ చేబ్రోలులో డిప్లొమా చదవుతూ సెలవులకు ఇంటికి వచ్చాడు. జగదీశ్ మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించడంతో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో కొత్త రేవుపోలవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విభీషణరావు చెప్పారు.



మృతి చెందిన పల్లేటి జగదీశ్ (ఫైల్)

### అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు : సీఐ

రాంబిల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగను పరిస్కరించుకొని గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాంబిల్లి సర్కిల్ సీఐ నరసింగరావు ఆదివారం తెలిపారు. కోడిపందాలు, గుల్లాట, పేకాటలు వంటి జూదాలకు దూరంగా ఉండాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదన్నారు. పండగ సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అల్లర్లకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. పండగ వేళ దొంగలు ఎక్కువగా తిరిగే అవకాశం ఉన్నందున వేరొక గ్రామాలకు వెళ్లే ప్రజల ఇళ్లకు పటిష్టమైన తాళాలు వేసుకోవడంతోపాటు విలువైన వస్తువులను తమతోపాటు తీసుకువెళ్లాలని సూచించారు. మండల కేంద్రంతో సహా అన్ని గ్రామాల్లో నిఘా ఏర్పాటు చేసినట్టు సీఐ నరసింగరావు తెలిపారు.

## ఇంటర్వ్యూ..

### 60 హెక్టార్లలో రబీలో వరి సాగు

**సి.సుమంత, వ్యవసాయాధికారిణి**



(ఆంధ్రజ్యోతి/ రాంబిల్లి)

ప్రశ్న: మండలంలో ఎన్ని హెక్టార్లలో రబీ వరి సాగు చేపడుతున్నారు.?

జవాబు : మండలంలోని 60 హెక్టార్లలో రైతులు రబీ వరి సాగు చేస్తున్నారు.

ప్రశ్న: ఏఏ రకాలు విత్తనాలు వేశారు?

జవాబు: ఆరు పంచాయతీల్లో 23.20 క్విం టాళ్ల ఎంటీయూ 1121 రకం, నెల్లూరు సన్నాలు వరి విత్తనాలు పంపిణీ చేశాం.

ప్రశ్న: ఎరువులు ఏ మేరకు రైతులకు అందజేశారు.?

జవాబు: అన్ని రకాల ఎరువులను నిరంతరం అందజేస్తున్నాం.

ప్రశ్న: వ్యవసాయ పరికరాలు రాయితీపై అందజేస్తున్నారా?

ప్రశ్న : వ్యవసాయ పరికరాలు రాయితీపై అందించేందుకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాలేదు.

ప్రశ్న: ఖరీఫ్ వరి కోతలు పూర్తయ్యాయా? దిగుబడులు ఎలా ఉన్నాయి?

జవాబు: ఖరీఫ్‌లో 1,943 హెక్టార్లలో రైతులు వరి సాగు చేపట్టారు. పంట కూడా ఆశాజనకంగా పండింది. ఎకరాలకు 34 నుంచి 36 బస్తాల వరకు దిగుబడి వచ్చినట్టు పంట కోత ప్రయోగాల్లో తెలుసుకున్నాం.

### వాలీబాల్ విజేత ధర్మవరం అగ్రహారం

ఎస్.రాయవరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగుమ్ములూరులో పీఆర్‌టీయూ మండల సంఘం ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో మండలంలోని ధర్మవరం అగ్రహారం జట్టు విజేతగా నిలవగా, రావికమతం మండలం గుమ్మలపాడుకు చెందిన జట్టు ద్వితీయస్థానంలో నిలిచినట్టు పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ధర్మవరం అగ్రహారం, గుమ్మలపాడు జట్ల మధ్య జరిగిన ఫైనల్ హోరాహోరీగా సాగింది. ప్రథమ విజేత ధర్మవరం అగ్రహారం జట్టుకు రూ. పది వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన గుమ్మలపాడు జట్లకు రూ. ఐదు వేలును ఆదర్శ విద్యా సంస్థల చైర్మన్ సీతారామరాజు, డాక్టర్ అనిల్‌వర్మ అందజేశారు. ఈ పోటీల రిఫరీలను పీఆర్‌టీయూ సంఘం సభ్యులు సన్మానించారు. కార్యకమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, సమన్వయకర్త సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### నేటితో ముగియనున్న మేలుకొలుపులు

మునగపాక, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మేలుకొలుపు ఉత్సవాలు సోమవారంతో ముగుస్తాయని మునగపాక పల్లపువీధి మేలుకొలుపు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఉదయం పల్లపువీధి వినాయక మందిరం నుంచి భోగి దేవుని ఊరేగింపు ఉంటుందని, అనంతరం అన్నసమారాధన ప్రారంభమవుతుందని ఉత్సవ కమిటీ తెలిపింది. అదేవిధంగా వాడ్రాపల్లిలో మేలుకొలుపు ముగింపుతోపాటు అన్నసమారాధన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

### అత్యాచార నిందితుడిని శిక్షించాలి

ఎలమంచిలి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో ఐదేళ్ల బాలికను అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ మండల కార్యదర్శి చింతకాయల శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

### టపాసు పేలి బాలుడికి గాయాలు

నక్కపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యాయంపూడి గ్రామంలో ఆదివారం సాయంత్రం టపాసు పేలడంతో బాలుడి అరచేతికి గాయమైంది. ఆదివారం హోం మంత్రి అనిత గ్రామంలో పర్యటించినప్పుడు కూటమి నాయకులు టపాసులు పేల్చారు. కాస్సేపటి తరువాత సాత్విక్ అనే బాలుడు పేలని టపాసు పట్టుకోవడంతో వెంటనే అది పేలి అరచేతికి గాయమైంది. తల్లిదండ్రులు నక్కపల్లి ఆస్పత్రికి తీసుకెళ్లారు.

### పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

పాయకరావుపేట రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలోని మసాహెబ్‌పేటలో ఆదివారం పేదలకు నిత్యావసర సరుకులను చారిటీ బాక్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కొంతం నాగేశ్వరరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గంటా శివ, ఆర్.కృష్ణతేజ, సూరిబాబు, కె.గోవిందు, వి.నానాజీ పాల్గొన్నారు.

### 15న శ్రీరామ అభయాంజనేయ తీర్థం

మునగపాక, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15వ తేదీన మునగపాకలో శ్రీరామ అభయాంజనేయ తీర్థం జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం 1 గంట నుంచి జిల్లాస్థాయి గుర్రం పరుగు పందెం పోటీలు జరగనున్నాయని తెలిపారు.

### రెండు పేకాట శిబిరాలపై దాడి

అచ్యుతాపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు పేకాట శిబిరాలపై ఆదివారం దాడి చేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నామని సీఐ నమ్మి గణేష్ తెలిపారు. సెజ్ పునరావాస కాలనీలో ఆరుగురిని అదుపులోకి తీసుకొని రూ. 2700, చోడపల్లిలో ముగ్గురికి అదుపులోకి తీసుకొని రూ. 1500 స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు.

## వేములపూడిలో యువకుడి అనుమానాస్పద మృతి


మృతుడు అప్పన్న(ఫైల్)

నర్సీపట్నం అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపూడి గ్రామంలో శనివారం అర్ధరాత్రి యువకుడు అనుమానాస్పదంగా మృతిచెందాడు. వేములపూడి గ్రామానికి చెందిన బండారు అప్పన్న (35) అదే గ్రామంలోని వినాయకనగర్ సమీపంలో శనివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో తీవ్ర గాయాలతో పడి ఉండడం తీవ్ర కలకలం రేపింది. వెంటనే స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి కుటుంబ సభ్యులు చేరుకుని 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. నర్సీపట్నం నుంచి 108 వాహనం వచ్చేసరికి అప్పన్న మృతిచెందాడని స్థానికులు తెలిపారు. అప్పన్న అన్నయ్య బండారు రమణ ఫిర్యాదు మేరకు నర్సీపట్నం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి తలపై, కాలుపై బలమైన గాయాలు ఉనటుట్టి రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ రాజారావు గుర్తించారు. మృతుని ఫోన్ కాల్ డేటాను అనుసరించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో పలువురు యువకులను నర్సీపట్నం పోలీస్ స్టేషన్‌కు రప్పించి విచారించారు. నర్సీపట్నం డీఎస్పీ మోహన్, రూరల్ సీఐ రేవతమ్మ సంఘటనా స్థలానికి ఆదివారం పరిశీలించారు. కొడుకు మృతితో తల్లిదండ్రులు బండారు మహాలక్ష్మి, ఆదిలక్ష్మి, అన్నయ్య రమణ భోరున విలపించారు. ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## నవోదయ నమూనా పరీక్షకు విశేష స్పందన


నర్సీపట్నంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నర్సీపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన నవోదయ నమూనా పరీక్షకు విశేష స్పందన లభించింది. ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(మెయిన్)లో జరిగిన పరీక్షకు 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ నెల 18న నవోదయ ప్రవేశ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులలో భయం పోగొట్టేందుకు నమూనా పరీక్ష ఉపయోగపడుతుందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ తెలిపారు. ఈ నమూనా పరీక్ష నర్సీపట్నం, అనకాపల్లి, చోడవరం, అరకు, పాడేరు, చింతపల్లి, గోపాలపట్నంల్లో నిర్వహించామన్నారు. పరీక్ష పర్యవేక్షులుగా రమణమూర్తి, కురచ రమణ, అల్లు అప్పారావు, ధనిమిరెడ్డి అప్పలనాయుడు, యు.శ్రీనివాస్ వ్యవహరించారు.

**చోడవరంలో...**

చోడవరం: పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వ హించిన నవోదయ మోడల్ పరీక్షకు విద్యార్థులనుంచి విశేష స్పందన లభించింది. పట్టణంలోని ఏడమ్స్ స్కూల్‌లో నిర్వహించిన ఈ పరీక్షకు చోడవరం, మాడుగుల నియోజకవర్గాల నుంచి 250 మంది హాజరయ్యారు. నవోదయ పరీక్షపై చిన్నారుల్లో అవగాహన కు ఈ మోడల్ పరీక్ష నిర్వహించినట్టు పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు ఎం.వీ. స్వామి తెలిపారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు త్వరలోనే బహుమతులందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణేశ్, త్రినాథ్, ఆడమ్స్ డైరెక్టర్ బద్రిమహంతి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి లంగడీ ఆటలో చోద్యం విద్యార్థుల ప్రతిభ


చోద్యం హైస్కూల్ క్రీడాకారులతో హెచ్ఎం శ్రీనివాస్, పీఈటీ నూకరాజు

కృష్ణాదేవిపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో శనివారం నిర్వహించిన జాతీయ లంగడీ ఆటలో గొలుగొండ మండలం చోద్యం హైస్కూల్‌లో చదువుతున్న నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారని హెచ్ఎం శ్రీనివాసరావు, నూకరాజు తెలిపారు. పీఈటీ కుందూరు విద్యార్థులను గ్రామ సర్పంచ్ అదపురెడ్డి గోపాలకృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ సత్తిబాబు, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొందలరాజు అభినందించారు.

# పందెం కోళ్లు

## సంక్రాంతికి సిద్ధం





సంక్రాంతి వచ్చేసింది. పండుగ సంబరాలకు వన్నెతెచ్చేలా కోడి పందాల నిర్వహణకు పల్లెలు సిద్ధమయ్యాయి. సంక్రాంతి నుంచి ప్రారంభమయ్యే కోడిపందాలకు పందెం రాయుళ్లు తమ పుంజులను సిద్ధం చేశారు. గోదావరి జిల్లాల స్థాయిలో భారీగా, బహిరంగంగా కాకపోయినా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో గోప్యంగా సంక్రాంతి సమ యంలో పందాలు నిర్వహిస్తుం టారు. కొత్త సంవత్సరం ప్రారం భంలో వచ్చే సంక్రాంతి పండుగ, ఆపై వరుసగా వేసవి ముగిసేంత వరకూ కొనసాగే గ్రామ దేవతల తీర్థాల్లో కోడిపందాలు వేస్తుంటారు.

- గోదావరి జిల్లాల్లో మాదిరి బహిరంగంగా కాకుండా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో గోప్యంగా నిర్వహణ
- పుంజులకు ప్రత్యేకమైన ఆహారం
- శరీరం ధృఢంగా ఉండేలా జాగ్రత్తలు
- ఒక్కొక్క పుంజు కనిష్ఠంగా రూ.15 వేలు, గరిష్ఠంగా రూ.లక్షపైనే

(చోడవరం, ఆంధ్రజ్యోతి)

కోడి పందాల నిర్వహణపై పోలీసుల ఆంక్షలు ఉన్నప్పటికీ గ్రామాల్లో ఏదో ఒక సమయంలో గంటల వ్యవధిలో వీటిని పూర్తిచేస్తుంటారు. ఏళ్ల తరబడి వస్తున్న ఈ ఆచారం ఈ ఏడాది కూడా కొనసాగనుందని చెప్పాలి. ఈ పోటీలకు తగినట్టుగానే పందాల్లో పాల్గొనే కోడి పుంజుల ధరలు కూడా కళ్లు చెదిరే విధంగా ఉండడం విశేషం.

**పందెం పుంజులు...రకాలు ఎన్నెన్నో...**

పందాలకు కోడిపుంజులను సిద్ధం చేయడం ఓ ప్రత్యేక క్రతువుగా నిర్వహిస్తుంటారు. పందాలకు దించే పుంజుల రకాలు, వాటికి ఇచ్చే ఆహారం, శిక్షణ ఇలా ప్రతి అంశం ఆసక్తికరంగా ఉంటాయంటే అతిశయోక్తి కాదు. పందెం కోళ్లు కాస్త విభిన్నంగా ఆకర్షణీయంగా ఉంటాయి. సాధారణ కోడిపుంజుల కంటే దృఢంగా ఉంటాయి. కోడిపుంజుల ఆకారం, వాటి రంగు, ఎత్తు, ఈకలు, శరీర నిర్మాణాన్ని బట్టి వివిధ రకాల పేర్లు ఉంటాయి. ప్రధానంగా పందాల్లో పాల్గొనే పుంజుల్లో ఎక్కువగా డేగ, డేగ పర్ల, నల్ల సవల, పూల, పింగళ, సేతువ, నల్లపాశ, మైల, కాకి, పచ్చకాకి, పెట్టమర్రి, అబ్రసు, గేరువ తదితర రకాలు ఉన్నాయి. కనిష్ఠంగా ఒక్కో పుంజు ధర 15 వేల నుంచి గరిష్ఠంగా లక్ష రూపాయలకుపైగా పలుకుతుంది. ఉమ్మడి జిల్లాలో కోడి పందాలు ఎప్పటి నుంచో డింకీ లేదా కత్తి కట్టడం...రెండు రకాలుగా నిర్వహిస్తున్నారు. రెండింటిలో ఏదైనా సరే...చివరి వరకూ బరిలో ఏది నిలిచి ఉంటుందో అది విజేతగా నిలుస్తుంది. గ్రామాల్లో పరిస్థితులు, పోలీసుల నిఘా సమయానుకూలతల ఆధారంగా ఏ రకమైన పందాలు నిర్వహించాలనేది నిర్వాహకులు నిర్ణయిస్తుంటారు.



**పుంజులు... పలు రకాలు**

పందెం కోడిపుంజులను వాటి ఈక లు, ఆకారాన్ని బట్టి రకరకాల పేర్లతో పిలు స్తారు. ఎరుపు రంగులో ఉండి, ఈకలు డేగ మాదిరిగా ఉంటే దానిని డేగగా పిలుస్తారు. ఇక కోడిపుంజు నీలం రంగులో ఉంటే కాకిగా పిలుస్తారు. పుంజు మెడ వద్ద పసుపు రంగులో ఉండి ఇతర భాగం తెల్ల రంగులో ఉంటే తెల్ల సవలగా, నల్లరంగులో ఉంటే నల్ల సవలగా పరిగణిస్తారు. బంగారు వర్ణంలో ఉండే కోడిని పచ్చకాకిగా పిలుస్తారు. కొన్నింటికి తోకలు నెమలి మాదిరిగా ఉంటాయి. ఇలాంటి వాటిని కాకి నెమలిగా పిలుస్తారు. ఇంకా మైల, సవల, నెమలి డేగ, కోడి డేగ, గట్టిడేగ, చింతపిక్క రంగుడేగ, కోడి నెమలి, నెమలి, కాకి, గట్టికాకి, సుద్దకాకి, కోడికాకి, నెమలి కాకి, కుసునలుపు కాకి, పచ్చకాకి, పూల, సేతువ, తెల్లసేతువ, నల్లబొట్లసేతువ, గేరువ, చిక్కని గేరువ, పండు గేరువ, ఇటుక గేరువ, అబ్రసు, రసంగి, పువల, తెల్లపువల, భోగ, కొత్తభోగ తదితర రకాలు ఉన్నాయి.

**క్రమపద్ధతిలో ఆహారం, శిక్షణ**

పందాలకు పుంజులను సిద్ధం చేసే తీరు ప్రత్యే కంగా ఉంటుంది. వీటికి ఇచ్చే ఆహారం ఖర్చుతో కూడిన వ్యవహారంగానే చెప్పాలి. ఈ పుంజులకు జీడిపప్పు, బాదం పిస్తా, ఎండు ఖర్జూరం, కిస్‌మిస్, కోడిగుడ్డులో తెల్లసొన, మేక నల్ల ప్రత్యేక ఆహారంగా ఇస్తుంటారు. వీటితో పాటు గోధుమలు, దంపుడు బియ్యం, రాగులు, గంట్లు, మినపపప్పు, శెనగపప్పు కలిపిన మిశ్రమం పెట్టి కోడి శరీరాన్ని దృఢంగా మార్చి వేస్తారు. కొందరు బలానికి టాబ్లెట్లు కూడా వాడు తుంటారు. పందెం కోడిపుంజులకు పెట్టే ఆహారానికి అయ్యే ఖర్చు వారానికి సుమారు రెండు వేల రూపాయలు వరకూ ఉంటుంది.

**కఠోర శిక్షణ**

పందాల కోసం సిద్ధం చేసే కోడిపుంజులకు ప్రత్యేకంగా ఆహారం ఇవ్వడంతో పాటు, పోటీలో గెలిచేలా కఠోర శిక్షణ కూడా ఉంటుంది. పుంజులను రోజూ పరిగెత్తించడం, స్విమ్మింగ్ చేయించడం, మసాజ్ చేయడం వంటి పనులన్నీ శిక్షణలో ఓ భాగం. ఉదయాన్నే కోడిపుంజును పరిగెత్తించిన అనంతరం పచ్చి కోడి గుడ్డు తెల్లసొన తినిపించి కొంతసేపు విశ్రాంతి ఇస్తారు. ఆ తరువాత కోడిపుంజు శక్తివంతంగా తయారయ్యేందుకు జీడిపప్పు, బాదంపప్పు, ఎండు ద్రాక్ష, ఎండు ఖర్జూరం, నల్లజీలకర్ర, తెల్ల జీలకర్ర, గసగసాలు దంచిన మిశ్రమాన్ని ముద్దగా తయారుచేసి తినిపిస్తారు.

ఆ తరువాత రెండు గంటల పాటు కోడికి విశ్రాంతి ఇస్తారు. అనంతరం కోడిని సమీపంలోని వాగుకు కానీ చెరువుకు కానీ తీసుకుని వెళ్లి నీటిలో ఈత కొట్టిస్తారు. సాయంత్రం సమయానికి కోడికి ఒంట్లో నొప్పులు లేకుండా బాడీ మసాజ్ చేస్తారు. కట్టెల మంటపై మట్టిపిడత ఉంచి దానిని వేడి చేసి ఆ వేడిని ఓ గుడ్డకు పట్టించి ఆ గుడ్డతో కోడి తలకు, ఒంటికి, కాళ్లకు మసాజ్ చేస్తారు. కోడి ఒంట్లో ఎక్కడైనా నొప్పులు ఉంటే అవి పోవడానికి ఈ మసాజ్ ఉపకరిస్తుంది. రాత్రికి కూడా కోడికి మంచి ఆహారం ఇస్తారు. ఏదిఏమైనా కోడి పందాలు, పుంజుల పెంపకం గ్రామీణ సంస్కృతిలో భాగమైపోయింది.

## తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం


గొల్లల పాలెంలో బోరు బావి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎంపిటీసీ సూర్యనారాయణ

రావికమతం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా మరుపాక సెగ్మెంట్‌లో రూ. 3లక్షలతో మూడు బోరుబావులు నిర్మిస్తున్నట్టు స్థానిక ఎంపీటీసీ సభ్యుడు ఎం.సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు మండల పరిషత్ నిధులతో మరుపాక, గొల్లలపాలెం,దాసరియ్యపాలెం గ్రామాల్లో ఈ బోర్లు నిర్మాణ పనులు ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు సహకారంతో తన పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

## నాతవరంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు


నాతవరంలో జరుగుతున్న కబడ్డీ పోటీలు

నాతవరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నాలుగు రోజుల నుంచి కేఎస్ఆర్ టీమ్ ఆధ్వర్యంలో పగలు క్రికెట్ పోటీలు, రాత్రి వేళల్లో కబడ్డీ,వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. కబడ్డీ పోటీల్లో 16 జట్లు,వాలీబాల్ పోటీల్లో 19 జట్లు, క్రికెట్ పోటీల్లో 32 జట్లు పాల్గొంటున్నాయి. ప్రవాసాంధ్రులు శెట్టి సతీష్, పైల వెంకటరమణ, పారుపల్లి కిరణ్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ సందర్భంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. విజేతలకు నగదు, షీల్డులను అందజేస్తామని, క్రీడాకారులను సత్కరించనున్నట్టు కేఎస్ఆర్ టీమ్ సభ్యులు సతీష్, వెంకటరమణ, కిరణ్ తెలిపారు.


## విశాఖ డెయిరీ బోనస్ ఇవ్వడం లేదు

**» జన్నవరం పాలసంఘం నేతల తీరుపై రైతుల ఆగ్రహం**


పాలకేంద్రం ఎదుట మాట్లాడుతున్న పాడి రైతులు

చోడవరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): హెరిటేజ్ డెయిరీకి పాలు పోస్తున్నామన్న కక్షతో తమకు విశాఖ డెయిరీ నుంచి రావాల్సిన సంక్రాంతి బోనస్ చెల్లించలేదని జన్నవరం పాలసంఘం నేతలపై ఆ గ్రామానికి చెందిన పాడిరైతులు లగిశెట్టి శ్రీనివాసరావు, సాలాపు పాపారావు, ఎస్‌వీ రమణ, ఎస్. సత్తిబాబుతోపాటు మరికొందరు ఆవేదన వ్యక్తం చేశారు. తాము 35 ఏళ్లుగా విశాఖ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్నామని, అయితే, తరచూ తమ పాలు ఫ్యాట్ రాలేదంటూ వైసీపీకి చెందిన పాలసంఘం నాయకులు తమను ఇబ్బందులకు గురి చేయడంతో గత్యంతరం లేక తాము హెరిటేజ్ డెయిరీతో పాటు విశాఖ డెయిరీకి కూడా పాలు సరఫరా చేశామన్నారు. తాము హెరిటేజ్ డెయిరీకి పాలుపోశామన్న కారణంతో, విశాఖ డెయిరీనుంచి సంక్రాంతి బోనస్ రాకుండా పాలసంఘం నేతలు తమ పేర్లు జాబితానుంచి తప్పించేశారని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య విశాఖ డెయిరీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా తమ మాట పట్టించుకోలేదని వాపోయారు.

## గోవాడలో క్రికెట్ టోర్నమెంట్


క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న దృశ్యం

చోడవరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వివేకానంద యువజనోత్సవాలలో భాగంగా మండలంలోని గోవాడలో సంక్రాంతి పురస్కరించుకుని క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. గ్రామ జెడ్పీ హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న ఈ క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌ను మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏడువాక సత్యారావు ప్రారంభించారు. ముందుగా వివేకానందుడి చిత్రపటానికి యువకులు నివాళులు అర్పించారు. నిర్వాహకులు కొలగాని సతీష్, స్థానిక నాయకులు బేరా సత్యారావు, వేపాడ వెంకట్, సాయి. సంతోష్, చిన్న, యశ్వంత్, బాలసాయి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు 'సృజనవాణి' అవగాహన

మాడుగుల రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీరవిల్లి అగ్రహారంలో సృజనవాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సూపర్ 60 కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. నిర్వాహకుడు గ్యానీ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎనిమిది, తొమ్మిది , పదో తరగతుల్లోని వివిధ పాఠశాలల నుంచి 60 మందిని రెండు గ్రూపులుగా ఏర్పాటు చేసి విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్, ప్రసంగం, జనరల్ ఎవేర్‌నెస్, పాఠ్యాంశాల్లోని ప్రశ్నలు, తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. సంక్రాంతి, ఇతర సెలవుల్లో విద్యార్థులతో కార్యక్రమం కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహేశ్, సురేశ్ పాల్గొన్నారు.

## కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలి

**» యువతకు నర్సీపట్నం డీఎస్పీ మోహన్ పిలుపు**


నిరుద్యోగులకు మెటీరియల్ అందిస్తున్న డీఎస్‌పీ మోహన్

కృష్ణాదేవిపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి.. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని నర్సీపట్నం డీఎస్పీ జీఆర్ఆర్ మోహన్ పిలుపునిచ్చారు. ఆదివారం కృష్ణాదేవిపేట అల్లూరి మైత్రి గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్‌ను సొంత నిధులతో డీఎస్పీ సమకూర్చారు. అనంతరం జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్ ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను డీఎస్పీ మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఈ స్టడీ మెటీరియల్‌ను నిరుద్యోగులు వినియోగించుకొని ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో యువత రాణిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. త్వరలో గ్రంథాలయానికి డిజిటల్ లైబ్రరీ చేసేందుకు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లోచల సుజాత, కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు, గ్రంథాలయ కమిటీ సభ్యులు చింతల అచ్చిరాజు, పోతల శ్రీరామమూర్తి, శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వామి వివేకానంద జయంతి


జి.కోడూరులో వివేకానంద విగ్రహానికి పూలమాలల వేస్తున్న దృశ్యం

మాకవరపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో జి.కోడూరులో స్వామి వివేకానంద జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడిగర్ల రాంబాబు మాట్లాడుతూ యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

**కృష్ణాదేవిపేటలో..**

నేటి యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని పాతకృష్ణాదేవిపేట రిటైర్డు హెచ్ఎం పీవీ రమణ అన్నారు. ఆదివారం గ్రామంలో వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి, వివేకానంద యూత్ సభ్యులు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## దామునాపల్లిలో సంక్రాంతి సంబరాలు

**» ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు**


వేదికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు

చోడవరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామునాపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో ఈనెల 14న సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్టు స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు తెలిపారు. ఈ సంబరాల్లో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ పాల్గొంటారన్నారు. దామునాపల్లిలో జిల్లా స్థాయి ఎడ్లపందాల పోటీలు, లక్ష్మీపురంలో ముగ్గుల పోటీలు తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఎడ్లపందాల పోటీల విజేతలకు బహుమతులు ఉంటాయన్నారు. ఆదివారం ఈ సంక్రాంతి సంబరాలకు సంబంధించి పోటీలు నిర్వహించే వేదికలను ఎమ్మెల్యే రాజు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జనసేన నాయకులు సిరిపురపు రమేశ్, సకురు కోటేశ్వరరావు, సేనాపతి శ్రీనివాసరావు, భూతనాధు నానికుమార్, పాతాళం శ్రీనివాసరావు, బూరె కనకనరసింహం, సిరిసోళ్ల సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

**దేవరాపల్లిలో ఏర్పాట్లు**

దేవరాపల్లి: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో సంక్రాంతి సంబరాలకు మంగళవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే బండారుసత్యనారాయణమూర్తి వివిధ పోటీలను ప్రారంభించనున్నారు. ఈ మేరకు స్థల పరిశీలన చేశారు. ఎంపీ సోదరుడు సురేశ్‌నాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు తది తరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు


ప్రచారం చేస్తున్న ఎస్ఐ మల్లేశ్వరరావు

దేవరాపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) సంక్రాంతి సంబరాలు పేరుతో అసాంఘిక కార్యక్రమాలు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్ఐ టి. మల్లేశ్వరరావు హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సంతలో ఆటోతో ప్రచారం చేశారు. కోడి పందాలు, పొట్టేలు పందాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

## మంచు దుప్పటి

మాడుగుల, జనవరి 12 (ఆంధ్ర జ్యో తి) : మాడుగులలో గత కొద్దిరోజులుగా చలితీవ్రత అధికంగా ఉంటోంది. పాడేరు ఏజెన్సీని తలపించేలా మండల పరిధిలో గ్రామాల్లో మంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 8 గంటల వరకు చలి వణికిస్తోంది. రోడ్లపై పొగమంచు కురుస్తుండడంతో రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది. అలాగే సాయంత్రం 4 గంటల నుంచే చలి అధికమవుతోంది.

## విద్యుత్ సర్దుబాటు చార్జీలపై నిరసన

దేవరాపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) విద్యుత్ సర్దుబాటు చార్జీలు ఉపసంహరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఏభై అడుగుల విద్యుత్ బిల్లుల నమూనాను ఆదివారం మండల కేం ద్రంలో ఊరేగించి దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొర, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెండు బైకులు ఢీ : ఒకరి మృతి

**» మరో ఇద్దరికి తీవ్ర గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం**


మృతి చెందిన పల్లేటి జగదీశ్ (ఫైల్)

ఎస్.రాయవరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రాజుపేట జంక్షన్‌కు సమీపంలో శనివారం రాత్రి పదిన్నర గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పల్లేటి జగదీశ్ (19) మృతి చెందగా.. మరో ముగ్గురు గాయపడ్డారని ఎస్ఐ విభీషణరావు ఆదివారం తెలిపారు. ఎస్ఐ, గ్రామస్థులు అందించిన వివరాలిలా ఉన్నాయి.

కొత్త రేవుపోలవరం గ్రామానికి చెందిన పల్లేటి జగదీష్, ఎరిపిల్లి వాసు బైకుపై షాపింగ్ నిమిత్తం శనివారం సాయంత్రం అడ్డరోడ్డు వెళ్లారు. రాత్రి తిరిగి ఇంటికి వస్తుండగా గుర్రాజుపేట జంక్షన్ దాటిన తర్వాత ముందు వెళుతున్న అదే గ్రామానికి చెందిన కోసూరి హర్షిత్, పి.ఇబ్రాయిల్ బైక్‌ను వెనుక నుంచి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో పల్లెటి జగదీష్ (19) అక్కడికక్కడే మృతి చెందగా.. ఎరిపిల్లి వాసు, కోసూరి హర్షిత్‌లకు తీవ్ర గాయాలు కాగా.. పి. ఇబ్రాయిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. దీంతో వాసును కుటుంబ సభ్యులు అనకాపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా.. హర్షిత్‌ను విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో జాయిన్ చేశారు. వాసు ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం కాస్త బాగానే ఉన్నప్పటికీ.. హర్షిత్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్టు ఆ గ్రామస్థులు తెలిపారు. మృతుడు జగదీష్ కేరళలో నెట్స్ వ్యాపారం చేస్తున్నాడు. తన కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి పండగ జరుపుకోవడం కోసం ఈనెల ఒకటో తేదీన స్వగ్రామం వచ్చాడు. విశాఖలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు హర్షిత్ చేబ్రోలులో డిప్లొమా చదవుతూ సెలవులకు ఇంటికి వచ్చాడు. జగదీష్ మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించడంతో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో కొత్త రేవుపోలవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విభీషణరావు చెప్పారు.

## 'అంబేడ్కర్ ఆలోచన విధానమే దేశానికి శరణ్యం'

దేవరాపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆలోచన విధానమే దేశానికి శరణ్యమని ఎస్సీ, ఎస్టీ మోనటరింగ్ కమిటీ సభ్యుడే కాటపల్లి అప్పారావు అన్నారు. స్థానిక సన్యాసమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం దళిత సంఘాల సమాఖ్య ఐక్య వేదిక సమావేశం జరిగింది. కేంద్ర, రా ష్ట్ర ప్రభుత్వాల కుట్రలో భాగంగా ఎస్సీలను విభజించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్లి సాయిసుందర్, వీర్రాజు, తాడి. అప్పారావు, ఉల్లి శ్రీను, కాటపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## అమేయకు నేషనల్ యూత్ ఐకాన్ అవార్డు


కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖా మంత్రి జోయల్ ఓరమ్‌తో అమేయ

విశాఖపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : స్వామి వివేకానంద జయంతి సందర్భంగా న్యూఢిల్లీలో ఆదివారం నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవంలో నగరానికి చెందిన ప్రముఖ శాస్త్రీయ నృత్య కళాకారిణి లగుడు అమేయ నేషనల్ యూత్ ఐకాన్ 2025 అవార్డు అందుకున్నారు. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖా మంత్రి జోయల్ ఓరమ్ చేతుల మీదుగా ఈ అవార్డు తీసుకున్నారు. అమేయ శాస్త్రీయ నృత్య కళాకారిణిగా వందకు పైగా అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రదర్శలిచ్చారు. ఇప్పటివరకు 8 అంతర్జాతీయ, 9 జాతీయ, 18 రాష్ట్రస్థాయి అవార్డులు పొం దారు. గిన్నీస్ వరల్డ్ రికార్డ్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, పది ప్రపంచ రికార్డులు సాధించారు.


రోడ్డుకు ఇరువైపులా తుప్పలు


రాళ్లులేచి అధ్వానంగా ఉన్న మార్గం

# రహదారి ఇలా..... ప్రయాణం సాగేదెలా?

- అధ్వానంగా చింతలపూడి- చోద్యం రహదారి
- నాలుగు కిలోమీటర్ల పొడవునా గోతులు...తుప్పలు
- పట్టించుకోని సంబంధిత శాఖాధికారులు
- వాహన చోదకులకు ఆందోళన

కొయ్యూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి- చోద్యం రహదారికి దశాబ్దకాలంగా కనీస మరమ్మతులులేక ఈ మార్గంలో ప్రయాణం ప్రమాద భరితంగా మారింది. దీనికి తోడు రహదారికి ఇరువైపులా తుప్పలు ఆక్రమించటంతో వాహన చోదకులు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ రహదారి ఆధారంగా మండలానికి చెందిన ఐదు పంచాయతీలకు చెందిన సుమారు 40 గ్రామాలకు మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. దీనిని 2009లో అప్పటి ప్రభుత్వ హయాంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే దివంగత గొడ్డేటి దేముడు పట్టుపట్టి మరీ రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హయాంలో రహదారి నిర్మాణాలు పూర్తయ్యాయి. నాటి నుంచి నేటి వరకు కనీస మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. కాంట్రాక్టర్ గ్యారంటీ కాలంలో సైతం రహదారిపై గోతులు పడినా వాటిని పూడ్చలేదు. దీంతో క్రమేణా రహదారి మరింత అధ్వానంగా మారింది. ప్రధానంగా కొమ్మిక శివారు బొర్రంపేట నుంచి చింతలపూడి పంచాయతీ గింజర్తి వరకు సుమారు ఐదు కిలోమీటర్లు పొడవునా పూర్తిగా శిధిలమై గోతులు, రాళ్ల తేలి ప్రయాణం నరకాన్ని తలపించేలా మారింది. అలాగే మధ్యలో ఘాట్‌రోడ్డు సైతం శిథిలం కావడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు రహదారికిరువైపులా తుప్పలు పెరిగి రెండొంతలు ఆక్రమించాయి. దీంతో ఈ రహదారి కేవలం కాలిబాట మాదిరిగా మారింది. ఈ తుప్పలను సైతం గడిచిన తొలగించకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సుమారు 40 గ్రామాల మండల వాసులకు మండల కేంద్రం రా వడానికి అనేక అవస్థలు పడుతున్నారు. ఇకనైనా సంబంధితశాఖాధికారులు స్పందించి కనీసం రహదారికి ఇరువైపులా ఉన్న తుప్పలు తొలగించే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## బీజేపీ మైనార్టీ మోర్చా నాయకులు రాజీనామా

పాడేరురూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పదవికి రాజీనామా చేసిన పెనుమాక రవికుమార్‌కు మద్దతుగా జిల్లాలోని పలువురు నాయకులు తమ పదవులను వదులకుని ఆయనను ఆదివారం ప్రకటించారు. రవికుమార్‌కు మద్దతుగా జిల్లా మైనార్టీ మోర్చ అధ్యక్షుడు రాస పాపిటిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.అజయ్‌పాల్, జిల్లా ఉపాధ్యక్షులు పి.రమణ, గొర్లె సోమేశ్, బీజేపీ మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాంగి సైమాన్‌లు బీజేపీ పదవులకు రాజీనామాలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.


రాజీనామాచేసిన రవికుమార్, పాపిటిరాజు


పాడేరులో వస్త్ర దుకాణాలంతో రద్దీ


కిటకిటలాడుతున్న దారకొండలో వారపు సంత

# మార్కెట్లకు సంక్రాంతి శోభ

- కిటకిటలాడిన వస్త్ర, కిరాణా దుకాణాలు

పాడేరురూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ నేపథ్యంలో ఆదివారం పాడేరు మార్కెట్‌లో సంక్రాతి శోభ కనిపించింది. సోమవారం భోగి పండగ కావడంతో పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్ట మండలాల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు ఆదివారం పాడేరు చేరుకొని నూతన వస్త్రాలు కొనుగోలు చేశారు. దీంతో వస్త్ర దుకాణాలు, ఫుట్‌పాత్‌పై అమ్మకాలు జోరుగా సాగాయి. కిరాణా దుకాణాలు, చెప్పుల షాపులతో పాటు గృహోపకరణాల అమ్మకం షాపులు కొనుగోలుదారులతో నిండిపోయాయి. ఈ షాపులతోపాటు పట్టణ ప్రధాన రహదారులు, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రయాణీకులతో రద్దీగా కనిపించాయి.


పాడేరులో ఫుట్‌పాత్‌పై దుస్తుల వద్ద కొనుగోలుదారులు

### సీలేరు, ధారకొండల్లో కిటకిటలాడిన సంతలు

సీలేరు: జీకేవీధి మండలం సీలేరు, ధారకొండల్లో ఆదివారం వారపు సంతలు కిటకిటలాడాయి. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో గిరిజనుల ఆచార సంప్రదాయంలో భాగంగా సంక్రాంతిని ఈ నెల 13,14,15 తేదీల్లోనే వచ్చింది. ఈ నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో గిరిజనులు సీలేరు, ధారకొండ సంతలకు వచ్చి కొత్త దుస్తులు, గాజులు, కిరాణా సామగ్రి తదితర వాటిని కొనుగోలు కొనుగోలు చేశారు. దీంతో సంతలు ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతలు కిటకిటలాడాయి. గత కొంత కాలంగా వ్యాపారులు అమ్మకాలు తగినంతగా లేకపోవడంతో డీలా పడ్డారు. .ఆదివారం వ్యాపారాలు జోరుగా సాగడంతో ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

## ఇంటర్వ్యూ..

### సంక్రాంతి పేరిట జూదాలు నిర్వహిస్తే చర్యలు తప్పవు

- పాడేరు సీఐ డి.దీనబందు


సీఐ దీనబంధు

ప్రస్తుత సంక్రాంతి పండుగ సందర్భంగా ఇతర ఊర్లకు వెళ్లే వాళ్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రధానంగా ఇళ్లల్లో బంగారు, వెండి, నగదు వంటి వి లువైన వస్తువులను ఉంచవద్దని స్థానిక సీఐ. డి.దీనబందు తెలిపారు. అలాగే గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసేందుకు నిఘా పెంచామని ఆయన తెలిపారు. ఆయన 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో పలు అంశాలు వివరించారు.

ప్రశ్న: సంక్రాంతి నేపథ్యంలో జనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏంటి?

సీఐ: ప్రజలు తమ ఇళ్లలో విలువైన వస్తువులు ఉంచకూడదు. ఇతర ప్రాంతాలకు వెళ్లేవాళ్ల తమకు వారి ఇళ్ల సమాచారం అందిస్తే తగిన భద్రతా చర్యలు చేపడతాం. దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

ప్రశ్న: జూదాల నివారణకు చేపట్టే చర్యలు?

సీఐ: పండుగల పేరిట చట్టవ్యతిరేకమైన జూదాలను నిర్వహిస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ సహించం. ముఖ్యంగా కోడిపందేలు, పేకాట, గుళ్లాటల వంటివి నిర్వహిస్తే అందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు చేపడతాం.

ప్రశ్న: గంజాయి అక్రమ రవాణాపై ఏమేరకు చర్యలు చేపడుతున్నారు.

సీఐ: ఒడిశా నుంచి మన ప్రాంతం మీదుగా ఇతర ప్రాంతాలకు గంజాయి అక్రమ రవాణా జరగకుండా నిఘా పెంచాం. ఈ ప్రాంతం మీదుగా రాకపోక లు సాగిస్తున్న వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలుచేపడుతున్నాం.అనుమానితులు, గంజాయి కేసుల్లో బెయిల్‌పై వచ్చిన వారిపైనా నిఘా పెట్టాం. గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్టకు అన్ని చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న: గంజాయి, మాదకద్రవ్యాల జోలికి విద్యార్థులు వెళ్లకుండా ఏం చేస్తున్నారు?

సీఐ: పాఠశాలలు, కళాశాలల్లో సైతం మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై విద్యార్థులు చైతన్యం చేస్తున్నాం. ఎట్టిపరిస్థితుల్లోనూ మత్తుపదార్థాల జోలికి వెళ్లవద్దని ప్రత్యేకించి సమావేశాలు పెట్టి అవగాహన కల్పిస్తున్నాం. అలాగే విద్యాలయాలకు గంజాయి సరఫరా కాకుండా సిబ్బందితో నిఘా పెట్టాం. విద్యార్థులకు గంజాయి అందించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు చేపడతాం.

-పాడేరు, ఆంధ్రజ్యోతి

## గిరిజన ప్రాంత సమస్యలపై సీపీఐ పోరాటం


విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

చింతపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత ప్రజలు సమస్యలపై సీపీఐ నిరంతర పోరాటం కొనసాగిస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ నాయకులు విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే పార్టీని కొనసాగిస్తున్నామన్నారు. ప్రజాపక్షపాతిగా పనిచేస్తున్న సీపీఐకి ప్రజలు విరాళాలు ఇచ్చి సహకరించాలన్నారు. గిరిజన ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాలను అడ్డుకునేందుకు పోరాటం చేసిందన్నారు. గిరిజనులకు పక్కా గృహాలు, రహదారుల కు కృషి చేసినట్టు చెప్పారు. ఈ కార్య క్రమంలో నాయకులు పేట్ల పోతురాజు, షేక్ రహ్మాన్, ఇరువాడ రాజు, సెగ్గె సత్యనారాయణ, చిన్నారావు తదితరులున్నారు.

# సికరిని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతా...

- అరకు ఎంపీ తనూజారాణి

పెదబయలు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నియోజవర్గ పరిధిలోనే సీకరి పంచాయితీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని అరకులోయ పార్లమెంట్ ఆధ్యక్షురాలు తనూజా రాణి పేర్కొన్నారు. ఆదివారం ఎంపీ మెట్టినూరైన మండలంలోని సీకరి పంచాయితీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఎంపీ పదవీ స్వీకరించిన తరువాత తొలిసారి గ్రామానికి విచ్చేసిన ఆమెకు గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ నెల 9.10 తేదీల్లో గ్రామంలో మూడేళ్లకు ఒకసారి జరిగే గంగమ్మతల్లి జాతర ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆలయానికి వెళ్లే మార్గం ఇరుకుగా ఉండటంతో సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని తెలిపారు. రూ.50 లక్షలతో గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామన్నారు. పన్నేడా జంక్షన్ వద్ద సింహద్వారం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానన్నారు. పంచాయితీ పరిధిలోని గ్రామాల్లో ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. గ్రామ దేవత ఉత్సవాలకు సహకారం అందిస్తానన్నారు. తమ కుటుంబాన్ని ఆదరిస్తున్న గిరిజనులకు తాను ఆదర్శంగా నిలిచి సేవలందిస్తామన్నారు. అనంతరం క్రీడా మైదానంలో ఉత్సవాల నేపథ్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి చెట్టి వినయ్, సర్పంచ్‌లు కృష్ణారావు, సరేష్‌కుమార్, నాయకులు ఆనందరావు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ తనూజారాణి

## నవోదయ మోడల్ పరీక్షకు 48 మంది హాజరు

పాడేరురూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ (గవర్నమెంట్ టీచర్స్) ఆ ధ్వర్యంలో లోచలిపుట్టులో ఉన్న శ్రీఅక్షర హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన నవోదయ మోడల్ ఎంట్రన్స్ పరీక్షకు మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 48 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరైనట్టు అసోసియేషన్ మండలాధ్యక్షురాలు వంజంగి హేమలత తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల కార్యదర్శి రేగం సత్యారావు, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు బి.సన్యాసమ్మ, నాయకులు కిముడు దేముళ్ళు నాయుడు, రేగం సత్యారావు, కుడుముల కాంతారావు, బాకూరు వేణుగోపాలరాజు, శోభన్, శ్రీఅక్షర హైస్కూల్ ప్రిన్సిపాల్ ఐ.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**చింతపల్లిలో..**

చింతపల్లి: మండల కేంద్రంలో పీఆర్‌టీయూ నిర్వహించిన నవోదయ మోడల్ పరీక్షకు విశేష స్పందన లభించిందని జిల్లా అధ్యక్షుడు యూవీ గిరి తెలిపారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈ పరీక్ష ఏర్పాటు చేశారు. జీకేవీధి, చింతపల్లి మండలాల నుంచి 68మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈసందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ నవోదయ పాఠశాల ప్రవేశాలపై విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని మోడల్ పరీక్షను ఏర్పాటు చేశామన్నారు. గిరిజన ప్రాంత విద్యార్థులు అధిక సంఖ్యలో నవోదయ పాఠశాలలో సీట్లు సాధించాలనేది తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సెలర్ కొర్రు మత్స్యలింగం, ఉపాధ్యాయుడు సేవా ప్రతాప్ పాల్గొన్నారు.


పాడేరులో పరీక్ష నిర్వహిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

## దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలి


వివేకానందుని చిత్రపటానికి నివాళర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

అరకులోయ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక డిగ్రీ కళాశాల వద్ద ఆదివారం జాతీయ సేవా పథకం, విశాఖపట్నం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ భరత్‌కుమార్‌నాయక్ మాట్లాడుతూ, యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువత అధికంగా ఉన్న దేశం భారతదేశమని, ప్రపంచాన్ని నడిపించేసత్తా యువతకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలోని వైస్ ప్రిన్సిపల్ పుష్పరాజ్, ఎన్ఎస్‌ఎస్‌పీవోలు అనిత, విజయలక్ష్మి, కొండబాబు, గణేశ్, సుందరిరాణి, రాజు, సొంబాబు, దొన్ను, తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

చింతపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నట్టు గిరిజన యువ ప్రగతి డైరెక్టర్ ఎం. నాగేంద్రబాబు తెలిపారు.మండలంలోని లోతుగెడ్డ జంక్షన్ గ్రామంలో నెల రోజులు సర్టిఫికెట్ కోర్సు శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు ధ్రువీకరణ పత్రం అందజేస్తామన్నారు. ఆసక్తిగల గిరిజన నిరుద్యోగ యువత వివరాలకు ఫోన్: 83328 87885 కాల్‌చేయవచ్చునన్నారు.

## విద్యుత్ సర్దుబాటు చార్జీలపై పోరాడాలి: సీపీఎం

పాడేరురూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాటు చార్జీలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాచిపెంట అప్పలనర్స పిలుపునిచ్చారు. ఆది వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి నేతలు అధికారంలోకి రాగానే మాట తప్పి రూ. 15,484 కోట్లు సర్దుబాటు చార్జీల భారం ప్రజలపై వేశారన్నారు. పాత మీటర్లు తొలగించి కొత్త స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారన్నారు. వీటిని ముందుగా ప్రభుత్వ కార్యాలయాల్లో బిగించిన అధికారులు ఇప్పుడు షాపులు, సంస్థ కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తున్నారన్నారు. వ్యవసాయ పంపు సెట్లకూ బిగిస్తున్నారన్నారు. త్వర లో ప్రతీ గృహానికి ఈ మీటర్లు బిగిస్తారన్నారు. ఈ ప్రీ పెయిడ్ మీటర్లు వల్ల విద్యుత్‌కు ఫోన్‌లో బ్యాలెన్స్ వేసుకొనేలా వేసుకోవాల్సి ఉంటుందన్నారు. బ్యాలెన్స్ అయిపోగానే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.అదానీ, కార్పొరేట్ సంస్థల మేలు కోసం కేంద్ర ప్రభుత్వం దేశమంతా ఈ మీటర్లు బిగించాలని ఆదేశించారన్నారు. ఈ నేపథ్యంలో చార్జీలపై నిరసనలు తెలపాలన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా పెట్రోల్ బంక్ నిర్మాణం


రింతాడలో బంకు నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఉప సర్పంచ్, వార్డు సభ్యులు

గూడెంకొత్తవీధి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రింతాడ గ్రామ పంచాయతీలో నిబంధనలకు విరుద్ధంగా పెట్రోల్ బంక్ నిర్మాణం చేపడుతున్నట్టు స్థానిక ఉప సర్పంచ్ సోమేశ్‌కుమార్ తెలిపారు. ఆదివారం పంచాయతీ పరిధిలో పెట్రోల్ బంక్ నిర్మిస్తున్న స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో గ్యాస్ గోదాములు, పెట్రోల్ బంకులు, ఇతర వ్యాపార సంస్థలు ఏర్పాటు చేకు పంచాయతీ గ్రామ సభ (పెసా) తీర్మానం కచ్చితంగా ఉండాలన్నారు. ఇవేవీలేకుండా నిర్వాహకులు ఇష్టారాజ్యంగా బంకు నిర్మాణ పనులు చేపడుతున్నారన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు ఈ పనులను నిలిపివేయాలని, లేదంటే గ్రామస్థులతో కలిసి అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సాగిన జోగిపడాల్, గెమ్మెల పాల్స్, తగ్గి కాసులమ్మ, కంకిపాటి చంటి, కిల్లో ధనలక్ష్మి పాల్గొన్నారు.

## చలికి గజగజ


ముంచంగిపుట్టులో చలిమంటలు కాగుతున్న దృశ్యం

ముంచంగిపుట్టు, జనవరి 12 ( ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో చలి గజగజలాడిస్తోంది. ఆదివారం చలికి తట్టుకోలేక మంటల వద్ద కాచుకున్నారు. ఉదయం పది గంటలు వరకు మంచు దట్టంగా కమ్ముకుంది. సాయంత్రం నాలుగు గంటల నుంచే చలి ప్రభావం కనిపించింది. దీంతో మండల కేంద్రంతో పాటు ఏ గ్రామాన్ని సందర్శించినా చలి మంటలు కాగుతున్న దృశ్యాలు దర్శనమిచ్చాయి. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది చలి ఎక్కువగా ఉంది. దీంతో పలు రకాల ఆరోగ్యపర సమస్యలు ఎదుర్కోవల్సి వస్తుందని, బయటకు వెళ్లే వారు తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

## నృసింహ దీక్షలు విరమణ


దర్శనానికి వస్తున్న చందనస్వాములు

సింహాచలం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దీక్షలు చేపట్టిన భక్తులు ఆదివారం మాల విసర్జన చేశారు. గత ఏడాది డిసెంబరు 2న మండల దీక్షలు, 12న ద్వాత్రింశతి (32 రోజులు) దీక్షలను అప్పన్న ఆలయ అర్చకుల చేతుల మీదుగా వేలాది మంది భక్తులు స్వీకరించారు. ఆదివారం వేకువజామున సింహగిరికి చేరుకున్న చందనస్వాములు స్వామివారిని దర్శించుకుని, తిరుముడులు సమర్పించారు. దీక్షల విరమణ పురస్కరించుకుని దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు ఆదేశాల మేరకు అధికారులు ఉచిత రవాణా, దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఒకరోజు వసతి, భోజన సదుపాయం కల్పించారు. అలాగే 98వ వార్డు పరిధిలోని చందన పెరుమాల్ పీఠం వ్యవస్థాపకుడు సానబోయిన పైడిరాజు, సింహాద్రి మఠం వ్యవస్థాపకుడు కసిరెడ్డి సురేంద్ర తమ పీఠాలలో చందనస్వాములకు తిరుముడులు కట్టి, పూజలు, సంకీర్తనలకు మార్గదర్శకం చేశారు.

### భక్తులతో కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం

పాడేరురూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరులోని మోదకొండమ్మ ఆల యం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన్యంతో పాటు మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి ఆలయం రద్దీ నెలకొంది.పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు వచ్చిన వివిధ ప్రాంతాల పర్యాటకులు అమ్మవారి దర్శనానికి క్యూ కట్టారు. మైదాన ప్రాంతం నుంచి వచ్చిన వందలాది మంది భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకొని ఆలయ ప్రాంగణంలో అమ్మవారి వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని అందించారు.

## టీటీడీ అన్ని విధాలా అండ


క్షతగాత్రులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, టీటీడీ పాలకమండలి సభ్యులు

... 3వ పేజీ తరువాయి

ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనకాపల్లి పట్టణంలోని గవరపాలేనికి చెందిన యల్లపు హిమబిందు, అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీ మూలపేట గ్రామానికి చెందిన ఆకుల యశ్వంత్, పరవాడ మండలం జోగివానిపాలెం గ్రామానికి చెందిన ఉయ్యూరు మాధవిలకు రూ.2 లక్షల చొప్పున చెక్కులు అందిచారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, టీటీడీ పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ, ఎం.ఎస్.రాజు, పనబాక లక్ష్మి, జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద, తాతయ్యబాబు, సీనియర్ నాయకులు బుద్ధ నాగజగదీశ్వరరావు, దాడి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రక్షణ లేని భవనాలు

... 3వ పేజీ తరువాయి

పాడైపోయింది. సుమారు 45 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం శిథిలావస్థకుచేరింది. గోడలన్నీ బీటలు వారాయి. శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. తలుపులు, కిటికీలు చెద పట్టేశాయి. భవనం చుట్టూ ముళ్లపొదలు పెరిగిపోయాయి. యువకులు, విద్యార్థులు ఖాళీ సమయాల్లో ఇక్కడ ఆటలాడుతుంటారు. ఈ సమయంలో భవనం కూలితే ప్రాణనష్టం జరుగుతుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శిథిలమైన ఈ భవనాన్ని సత్వరమే కూల్చివేయాలని కోరుతున్నారు.

## వెటర్నరీ డాక్టర్ త్రిపాత్రాభినయం!

... 3వ పేజీ తరువాయి

పశువైద్య కేంద్రానికి ఇన్‌చార్జిగా నియమించారు. మరోవైపు ఇదే మండలంలోని శృంగవరం పశువైద్య కేంద్రంలో కూడా డాక్టర్ లేకపోవడంతో గునుపూడి డాక్టర్‌నే ఇక్కడ కూడా ఇన్‌చార్జిగా నియమించారు. డాక్టర్ మోక్షరెడ్డి సోమ, మంగళవారాలు గునుపూడిలో, బుధ, గురు, శుక్రవారాలు నాతవరంలో, శనివారం శృంగవరంలో వైద్యసేవలు అందిస్తున్నారు. మండలం మొత్తం ఒకే ఒక్క వెటర్నరీ డాక్టర్ వుండడంతో తమ పశువులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడంలేదని పలుగ్రామాల రైతులు వాపోతున్నారు. ల్లా అధికారులు స్పందించి అన్ని పశువైద్యశాలలకు పూర్తిస్థాయిలో వైద్యులను, సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

## 18న వేల్పుల వీధి గౌరీ పరమేశ్వరుల ఉత్సవం



విలేకరులతో మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ చైర్మన్ వాకాడ బాబు

అనకాపల్లి టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మెయిన్ రోడ్డులోని వేల్పులవీధి జంక్షన్‌లో గల వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల ఉత్సవం ఈనెల 18వ తేదీన అత్యంత ఘనంగా నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ చైర్మన్ వాకాడ బాబు తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అమ్మవారికి సారెను సమర్పించామన్నారు. 171 ఏళ్ల చరిత్ర కలిగిన గౌరీ పరమేశ్వరుల ఉత్సవం సందర్భంగా భారీ ఎత్తున విద్యుద్దీపాలంకరణ చేపట్టనున్నామన్నారు. ముఖ్య కూడళ్లలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాల కోసం ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా చూస్తామన్నారు. ఆ రోజు అర్ధరాత్రి బాణసంచా కాల్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావాల్సిందిగా ఆయన కోరారు. ఈ సమావేశంలో కమిటీ కార్యదర్శి మద్దాల నూకరాజు, మద్దాల కూర్మారావు, ముత్తా ఈశ్వరరావు, గరికి వెంకటరావు, బొద్దపు ప్రసాద్, జనపరెడ్డి శ్రీరాములు, గొర్లి శేఖర్, గుమ్మాల నాగేశ్వరరావు, బాసూరు ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే కొణతాల ఆవిష్కరించారు. తొలుత ఆది దంపతులకు ఆయన పూజలు నిర్వహించారు.

## గ్రామాల్లో క్రికెట్ టోర్నమెంట్లు



టోర్నమెంటులో విజేతలకు బహూకరించేందుకు సిద్ధం చేసిన కప్‌లు

కొత్తూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లిలోని గవరపాలెం మున్సిపల్ హైస్కూల్‌లో మంగళ, బుధవారం ఫోర్ బౌండ్రి కప్ పేరిట క్రికెట్ టోర్నమెంటు నిర్వహించనున్నామని కార్యక్రమ నిర్వాహకులు కోరిబిల్లి హరి, ఆడారి సతీష్, కొణతాల శ్రీను తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని జమ్మూకశ్మీర్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కాండ్రేగుల వెంకట సురేష్ చేతుల మీదుగా ఆదివారం ఆవిష్కరించారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో విల్లూరి సంతోష్, కొసరాజు, కార్తీక్, దుర్గాప్రసాద్, చంద్రశేఖర్, సోను, దాడి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని రావ లమ్మపాలెంలో సోమవారం నుంచి సంక్రాంతి సందర్భంగా విలేజ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నట్టు చెప్పారు. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమంలో విజేతలకు వరసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ. 10 వేలు, రూ.5 వేలు అందజేస్తామని వివరించారు.

## భోగలింగంనాయుడు విగ్రహం పునః ప్రతిష్ఠ



భోగలింగంనాయుడు విగ్రహ పునః ప్రతిష్ఠలో పాల్గొన్న నేతలు

అనకాపల్లి టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నిదానందొడ్డిలో మున్సిపల్ మాజీ చైర్మన్ దాడి భోగలింగంనాయుడు విగ్రహ పునఃప్రతిష్ఠా కార్యక్రమాన్ని ఆదివారం ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా నిర్వహించారు. విగ్రహాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భోగలింగంనాయుడు పద్ధెనిమిదేళ్ల మున్సిపల్ చైర్మన్‌గా వ్యవహరించి అనకాపల్లిలో చిరస్థాయిగా నిలిచిపోయే అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. అలాగే, వివిధ పదవులను అలంకరించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, భోగలింగంనాయుడు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగంపై పూర్తి అవగాహన

**» న్యాయ విద్యార్థులకు సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహా సూచన » సబ్బవరంలోని డీఎస్ఎన్ఎల్‌యూ సందర్శన**





యూనివర్సిటీలో విద్యార్థులతో మాట్లాడుతున్న జస్టిస్ నరసింహా

సబ్బవరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగంపై న్యాయ విద్యా ర్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహా సూచించారు. సబ్బవరంలో గల దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయాన్ని ఆదివారం సాయంత్రం ఆయన సందర్శించారు. తొలుత వర్సిటీలోని అన్ని భవనాలు, లైబ్రరీని పరిశీలించారు. అనంతరం 'మన కోసం మనం రూపొందించుకున్నదే రాజ్యాంగం' అంశంపై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. మనం అనే పదానికి నిర్వచనమిస్తూ.. బ్రిటీష్ వారి దాస్యశృంఖాల నుంచి స్వాతంత్ర్యం తెచ్చుకుని మన దేశం, మన నేల, మన వాతావరణం, మన భాష అనేవి ఎలా ఉండాలో మనమే నిర్వచించుకున్నామని వివరించారు. తెలుగేతర విద్యార్థులు ఈ ఐదేళ్లలో తెలుగు భాష నేర్చుకునేందుకు కృషి చేయాలన్నారు. అలాగే, తెలుగు విద్యార్థులు ఇతర భాషలు నేర్చుకోవాలని సూచించారు. కొత్త భాష నేర్చుకోవడం అంటే.. కొత్త బలం తెచ్చుకోవడం వంటిదని పేర్కొన్నారు. వర్సిటీ ఉప కులపతి డాక్టర్ డి.సూర్యప్రకాశరావు అధ్యక్షతన జరిగిన రిజిస్ట్రార్ విశ్వచంద్రనాథ్, చీఫ్ వార్డెన్ భాగ్యలక్ష్మి, జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

### తాళ్లపాలెంలో
## అల్లూరి విగ్రహం ఆవిష్కరణ



విగ్రహావిష్కరణలో ఎంపీ రమేష్, ఎమ్మెల్యే కొణతాలు

కశింకోట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాలెం కూడలిలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆదివారం అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అల్లూరి త్యాగాలను, పోరాట పటిమను వారు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే నెల నుంచి 'తల్లిదీవెన, ఉచిత బస్సు'కు సన్నాహాలు

**» పల్లె పండుగలో ఎమ్మెల్యే పంచకర్ల వెల్లడి » పలు అభివృద్ధి పనులు ప్రారంభం**



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

సబ్బవరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల నుంచి తల్లిదీవెన, ఉచిత బస్సు పథకాలు అమలు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు తెలిపారు. మండలంలోని తవ్వవానిపాలెం, ఎల్లుప్పి, బోదివలస గ్రామాల్లో ఆదివారం పల్లె పండుగ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రమేష్‌బాబు తొలుత మినీ గోకులం షెడ్లు, సీసీ రోడ్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. తవ్వవానిపాలెంలో ప్రకృతి సాగు ద్వారా పండించిన ఉద్యాన ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏడాదిలోగా అన్ని వాగ్దానాలను నెరవేరుస్తామన్నారు. ఇళ్ల స్థలాలు, కొత్త పింఛన్లు, రేషన్ కార్డుల కోసం అర్హులంతా దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కోరారు. 311 ఆర్టీసీ బస్సు తవ్వవానిపాలెం మీదుగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.పద్మజ, తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, ఏవో పోతల సత్యనారాయణ, సర్పంచ్‌లు బోకం స్వామినాయుడు, ఉగ్గిన దేముడమ్మ, ఎంపీటీసీ ఉగ్గిన లక్ష్మి, కూటమి నాయకులు గొర్లి రామునాయుడు, ఇందలి రమణ, బలిరెడ్డి అప్పారావు, సాలాపు వెంకటేశ్వరరావు, గండి ముత్యాలనాయుడు, దొడ్డి సూర్యప్రకాశరావు, ఎం.మహలక్ష్మీనాయుడు, కర్రి కనకరాజు, అర్జునుడు, బంతి కోళ్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వివేకానంద జయంతి



గొల్లవీధిలో చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



కశింకోటలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో బీజేపీ నేతలు

అనకాపల్లి టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : వివేకానంద జయంతిని పట్టణంలో ఆదివారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. గొల్లవీధిలో గల ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వివేకానందుడ్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, కూటమి నాయకులు బోడి వెంకటరావు, సాయి, శ్రీనివాసరావు, దూలం గోపి, కోట్ని రామకృష్ణ, తలారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గొల్లవీధిలో బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు నర్సింగ్‌యాదవ్ ఆధ్వర్యంలో వివేకానంద జయంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా బోడా సుబ్రహ్మణ్యం గుప్తా హాజరై వివేకానందుని జీవితాన్ని వివరించారు. నాయకులు గొంతిన భక్తసాయిరాం, కొణతాల అప్పలరాజు, మారిశెట్టి భాస్కరరావు, భరత్ తదితరులు పాల్గొన్నారు. నెహ్రూచౌక్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు దూలం బుసిరాజు, సభ్యులు కాండ్రేగుల సర్వేశ్వరరావు, దొడ్డి రమేష్, కనిశెట్టి సురేష్‌బాబు, బండి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. గౌరీ గ్రంథాలయం వద్ద వివేకానందుని విగ్రహానికి గ్రంథాలయం ప్రతినిధులు దొడ్డి నూక అప్పారావు, కాండ్రేగుల వెంకటరమణ, కాండ్రేగుల సత్యనారాయణ, జగ్గ అప్పారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కశింకోట : మండల కేంద్రమైన కశింకోటలో వివేకానంద జయంతిని జరిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో యాభై మంది రక్తాన్ని దానం చేశారు. బీజేపీ నాయకులు కొండబాబు, బొడ్డేడ నాగేశ్వరరావు, అప్పికొండ అప్పారావు, నడిపల్లి సన్యాసిరావు, రాజు, రమణాజీ, నూకరాజు, శిష్టి అప్పారావు, గుమ్మాల శ్రీనివాసబాబు, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్వ్యూ..
#### సంక్రాంతి తరువాత
## 'నవోదయం-2'
**- వై.లక్ష్మున్నాయుడు, ఎక్సైజ్ సీఐ**



**సారా తయారీ, విక్రయాలు, బెల్టు షాపుల నిర్వహణ చట్ట ప్రకారం నేరం. వీటి జోలికెళ్లిన వారు ఎంతటి వారైనా విడిచిపెట్టేది లేదు. సంక్రాంతి తరువాత నవోదయం-2 కార్యక్రమాన్ని ప్రారంభించి తద్వారా వీటిని మరింత కట్టడి చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం.**

ప్రశ్న : సర్కిల్ పరిధిలో బెల్టు షాపుల నివారణకు చేపట్టిన చర్యలు ఏమిటి?

జవాబు : ఎక్సైజ్ పోలీసు స్టేషన్ సర్కిల్ పరిధిలోని ప్రతి గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఈ నెలలో ఇప్పటికే ఐదు బెల్టుషాపులను గుర్తించి చర్యలు తీసుకున్నారు. గత నవంబరులో పది కేసులు, డిసెంబరులో పన్నెండు కేసులు నమోదు చేశాం.

ప్రశ్న : బెల్టు షాపు నిర్వహిస్తున్నట్టు గుర్తిస్తే ఎలా ఫిర్యాదు చేయాలి ?

జవాబు : బెల్టుషాపులు నిర్వహణ జరిగితే అనకాపల్లి ఎక్సైజ్ కార్యాలయం ల్యాండ్ లైన్ నంబరు 08924 222192 లేదా టోల్ ఫ్రీ నంబరు 14405 నంబరుకు సమాచారం అందించాలి. అటువంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

ప్రశ్న : సారా ప్రభావిత ప్రాంతాలు గుర్తించారా?

జవాబు : నాటుసారా ప్రభావిత ప్రాంతాలుగా అనకాపల్లి మండలం వల్లూరు, కశింకోట మండలం ఉగ్గినపాలెం, పేరంటాలపాలెం, జమ్మాదులపాలెం, మునగపాక మండలం గంటవానిపాలెంలను గుర్తించాం. ఇప్పటి వరకు వల్లూరుకు చెందిన ఇద్దరు, గంటవానిపాలేనికి చెందిన ఇద్దరు, కొత్తపల్లి బుచ్చెయ్యపేటకు చెందిన ఇద్దరిపై బైండోవర్ కేసులు నమోదు చేశాం. ఆయా గ్రామాల్లో నిత్యం మా సిబ్బంది పర్యవేక్షిస్తూ నాటుసారాను నిర్మూలనకు కృషి చేస్తున్నారు. ప్రతి గ్రామాల్లో సారా నిర్మూలనకు ప్రతి శనివారం అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ప్రజలకు నాణ్యమైన మద్యం అందించాలి- ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి అనే నినాదంతో ముందుకు వెళ్తున్నాం.

ప్రశ్న : వైన్ షాపుల వద్ద పర్మిట్ రూమ్‌లు వేసుకొని అక్కడే మద్యం సేవించవచ్చా..?

జవాబు : వైన్ షాపుల వద్ద పర్మిట్ రూమ్‌లు వేసుకోకూడదు. వైన్ షాపుల్లో లూజు అమ్మకాలు జరపకూడదు. మద్యం కొనుగోలు చేసుకొని అక్కడే సేవిస్తే షాపు యజమానిపై, తాగిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తాం. - కొత్తూరు

### కోడిపందాలపై దాడి..
## తొమ్మిది మంది అరెస్టు

పరవాడ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : తానాం, దేశపాత్రునిపాలెం శివారులో గల జీడిమామిడి తోటల్లో నిర్వహిస్తున్న కోడి పందాల పై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.5,100 తో పాటు ఆరు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. తొమ్మిది మందిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## సబ్బవరం పాఠశాలలో పూర్వ విద్యార్థులు కలయిక



సబ్బవరం ప్రభుత్వ హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



స్నేహితుని కుటుంబానికి నగదు అందజేస్తున్న దృశ్యం

సబ్బవరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరం ప్రభుత్వ హైస్కూల్‌లో 1995- 2000 విద్యా సంవత్సరాల్లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. నాటి మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాల అనంతరం నాటి గురువులు సాధూరావు, నర్సింహమూర్తి, జంగ మయ్య, సుబహ్మణ్యం, వెంకటరావు, సుజాత నర్సింహమూర్తి, జంగమయ్య, సుబ్రహ్మణ్యం, వెంకటరావులను సత్కరించారు.

### స్నేహితుల కుటుంబాలకు సాయం

పరవాడ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2001-02 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. తమతో పాటు కలిసి చదువుకుని వివిధ కారణాలతో మృతి చెందిన స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. వీరిలో పరవాడకు చెందిన బండారు నీలబాబు కుటుంబానికి రూ.50 వేలు, ఈదులపాక ఫార్మా పునరావాస కాలనీకి చెందిన గొల్లవిల్లి సింహాద్రి కుటుంబానికి రూ.25వేలు, మునగపాక మండలం రాజుపేటకు చెందిన కర్రి శ్రీనివాసరావు కుటుంబానికి రూ.25వేలు చొప్పున ఆదివారం అందజేశారు. పూర్వ విద్యార్థులు పైలా పైడంనాయుడు, డి.సాగర్, రాజాన శ్రీను, వర్రి రమేష్, పైలా అప్పారావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

| కోడి గుడ్లు (నెక్) | |
|---|---|
| వంద గుడ్లు | రూ.లలో |
| విశాఖపట్నం | 520 |
| విజయనగరం | 524 |
| శ్రీకాకుళం | 524 |

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | రూ.లలో |
| రైతు ధర | 102.00 |
| లైవ్ ధర | 122.00 |
| విత్ స్కిన్ | 214.00 |
| స్కిన్ లెస్ | 224.00 |

### పోలీసులకు
## బకాయిల చెల్లింపు పై హర్షం

అనకాపల్లి టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ బకాయిలు, సప్లిమెంటరీ సరెండర్ లీవ్ బిల్లులు, జీపీఎఫ్, సీపీఎస్ ఉద్యోగుల బకాయిలను మంజూరు చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు తీసుకోవడంతో అనకాపల్లి జిల్లా పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధి ఎస్.శేషగిరిరావు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బకాయిల మంజూరుతో పోలీసుల కుటుంబాల్లో సంక్రాంతి పండుగ ముందునే వచ్చిందన ఆనందం నెలకొందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు పోలీస్ సిబ్బంది, కుటుంబాల తరపున ధన్యవాదాలు తెలిపారు.

# పందెం కోళ్లు

## సంక్రాంతికి సిద్ధం





సంక్రాంతి వచ్చేసింది. పండుగ సంబరాలకు వన్నెతెచ్చేలా కోడి పందాల నిర్వహణకు పల్లెలు సిద్ధమయ్యాయి. సంక్రాంతి నుంచి ప్రారంభమయ్యే కోడిపందాలకు పందెం రాయుళ్లు తమ పుంజులను సిద్ధం చేశారు. గోదావరి జిల్లాల స్థాయిలో భారీగా, బహిరంగంగా కాకపోయినా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో గోప్యంగా సంక్రాంతి సమయంలో పందాలు నిర్వహిస్తుంటారు. కొత్త సంవత్సరం ప్రారంభంలో వచ్చే సంక్రాంతి పండుగ, ఆపై వరుసగా వేసవి ముగిసేంత వరకూ కొనసాగే గ్రామ దేవతల తీర్థాల్లో కోడిపందాలు వేస్తుంటారు.

**- చోడవరం, ఆంధ్రజ్యోతి**

**» గోదావరి జిల్లాల్లో మాదిరి బహిరంగంగా కాకుండా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోగోప్యంగా నిర్వహణ**

**» పుంజులకు ప్రత్యేకమైన ఆహారం**


**» శరీరం దృఢంగా ఉండేలా జాగ్రత్తలు**

**» ఒక్కొక్క పుంజు కనిష్ఠంగా రూ.15 వేలు, గరిష్ఠంగా రూ.లక్షపైనే**

కోడి పందాల నిర్వహణపై పోలీసుల ఆంక్షలు ఉన్నప్పటికీ గ్రామాల్లో ఏదో ఒక సమయంలో గంటల వ్యవధిలో వీటిని పూర్తిచేస్తుంటారు. ఏళ్ల తరబడి వస్తున్న ఈ ఆచారం ఈ ఏడాది కూడా కొనసాగనుందని చెప్పాలి. ఈ పోటీలకు తగినట్టుగానే పందాల్లో పాల్గొనే కోడి పుంజుల ధరలు కూడా కళ్లు చెదిరే విధంగా ఉండడం విశేషం.

### పందెం పుంజులు...రకాలు ఎన్నెన్నో...

పందాలకు కోడిపుంజులను సిద్ధం చేయడం ఓ ప్రత్యేక క్రతువుగా నిర్వహిస్తుంటారు. పందాలకు దించే పుంజుల రకాలు, వాటికి ఇచ్చే ఆహారం, శిక్షణ ఇలా ప్రతి అంశం ఆసక్తికరంగా ఉంటాయంటే అతిశయోక్తి కాదు. పందెం కోళ్లు కాస్త విభిన్నంగా ఆకర్షణీయంగా ఉంటాయి. సాధారణ కోడిపుంజుల కంటే దృఢంగా ఉంటాయి. కోడిపుంజుల ఆకారం, వాటి రంగు, ఎత్తు, ఈకలు, శరీర నిర్మాణాన్ని బట్టి వివిధ రకాల పేర్లు ఉంటాయి. ప్రధానంగా పందాల్లో పాల్గొనే పుంజుల్లో ఎక్కువగా డేగ, డేగ సవల, పూల, పింగళ, సేతువ, నల్లపాశ, మైల, కాకి, పచ్చకాకి, పెట్టమర్రి, అబ్రసు, గేరువ తదితర రకాలు ఉన్నాయి. కనిష్ఠంగా ఒక్కో పుంజు ధర 15 వేల నుంచి గరిష్ఠంగా లక్ష రూపాయలకుపైగా పలుకుతుంది. ఉమ్మడి జిల్లాలో కోడి పందాలు ఎప్పటి నుంచో డింకీ లేదా కత్తి కట్టడం...రెండు రకాలుగా నిర్వహిస్తున్నారు. రెండింటిలో ఏదైనా సరే...చివరి వరకూ బరిలో ఏది నిలిచి ఉంటుందో అది విజేతగా నిలుస్తుంది. గ్రామాల్లో పరిస్థితులు, పోలీసుల నిఘా సమయానుకూలతల ఆధారంగా ఏ రకమైన పందాలు నిర్వహించాలనేది నిర్వాహకులు నిర్ణయిస్తుంటారు.



### పుంజులు... పలు రకాలు

పందెం కోడిపుంజులను వాటి ఈకలు, ఆకారాన్ని బట్టి రకరకాల పేర్లతో పిలుస్తారు. ఎరుపు రంగులో ఉండి, ఈకలు డేగ మాదిరిగా ఉంటే దానిని డేగగా పిలుస్తారు. ఇక కోడిపుంజు నీలం రంగులో ఉంటే కాకిగా పిలుస్తారు. పుంజు మెడ వద్ద పసుపు రంగులో ఉండి ఇతర భాగం తెల్ల రంగులో ఉంటే తెల్ల సవలగా, నల్లరంగులో ఉంటే నల్ల సవలగా పరిగణిస్తారు. బంగారు వర్ణంలో ఉండే కోడిని పచ్చకాకిగా పిలుస్తారు. కొన్నింటికి తోకలు నెమలి మాదిరిగా ఉంటాయి. ఇలాంటి వాటిని కాకి నెమలిగా పిలుస్తారు. ఇంకా మైల, సవల, నెమలి డేగ, కోడి డేగ, గట్టిడేగ, చింతపిక్క రంగుడేగ, కోడి నెమలి, నెమలి, కాకి, గట్టికాకి, సుద్దకాకి, కోడికాకి, నెమలి కాకి, కుసునలువు కాకి, పచ్చకాకి, పూల, సేతువ, తెల్లసేతువ, నల్లబొట్లసేతువ, గేరువ, చిక్కని గేరువ, పండు గేరువ, ఇటుక గేరువ, అబ్రసు, రసంగి, పువల, తెల్లపువల, బోగ, కొత్తబోగ తదితర రకాలు ఉన్నాయి.

### క్రమపద్ధతిలో ఆహారం, శిక్షణ

పందాలకు పుంజులను సిద్ధం చేసే తీరు ప్రత్యేకంగా ఉంటుంది. వీటికి ఇచ్చే ఆహారం ఖర్చుతో కూడిన వ్యవహారంగానే చెప్పాలి. ఈ పుంజులకు జీడిపప్పు, బాదం పిస్తా, ఎండు ఖర్జూరం, కిస్‌మిస్, కోడిగుడ్డులో తెల్లసొన, మేక నల్ల ప్రత్యేక ఆహారంగా ఇస్తుంటారు. వీటితో పాటు గోధుమలు, దంపుడు బియ్యం, రాగులు, గంట్లు, మినపపప్పు, శెనగపప్పు కలిపిన మిశ్రమం పెట్టి కోడి శరీరాన్ని దృఢంగా మార్చి వేస్తారు. కొందరు బలానికి టాబ్లెట్లు కూడా వాడుతుంటారు. పందెం కోడిపుంజులకు పెట్టే ఆహారానికి అయ్యే ఖర్చు వారానికి సుమారు రెండు వేల రూపాయలు వరకూ ఉంటుంది.

### కఠోర శిక్షణ

పందాల కోసం సిద్ధం చేసే కోడిపుంజులకు ప్రత్యేకంగా ఆహారం ఇవ్వడంతో పాటు, పోటీలో గెలిచేలా కఠోర శిక్షణ కూడా ఉంటుంది. పుంజులను రోజూ పరిగెత్తించడం, స్విమ్మింగ్ చేయించడం, మసాజ్ చేయడం వంటి పనులన్నీ శిక్షణలో ఓ భాగం. ఉదయాన్నే కోడిపుంజును పరిగెత్తించిన అనంతరం పచ్చి కోడి గుడ్డు తెల్లసొన తినిపించి కొంతసేపు విశ్రాంతి ఇస్తారు. ఆ తరువాత కోడిపుంజు శక్తివంతంగా తయారయ్యేందుకు జీడిపప్పు, బాదంపప్పు, ఎండు ద్రాక్ష, ఎండు ఖర్జూరం, నల్లజీలకర్ర, తెల్ల జీలకర్ర, గసగసాలు దంచిన మిశ్రమాన్ని ముద్దగా తయారుచేసి తినిపిస్తారు. ఆ తరువాత రెండు గంటల పాటు కోడికి విశ్రాంతి ఇస్తారు. అనంతరం కోడిని సమీపంలోని వాగుకు కానీ చెరువుకు కానీ తీసుకుని వెళ్లి నీటిలో ఈత కొట్టిస్తారు. సాయంత్రం సమయానికి కోడికి ఒంట్లో నొప్పులు లేకుండా బాడీ మసాజ్ చేస్తారు. కట్టెల మంటపై మట్టిపిడత ఉంచి దానిని వేడి చేసి ఆ వేడిని ఓ గుడ్డకు పట్టించి ఆ గుడ్డతో కోడి తలకు, ఒంటికి, కాళ్లకు మసాజ్ చేస్తారు. కోడి ఒంట్లో ఎక్కడైనా నొప్పులు ఉంటే అవి పోవడానికి ఈ మసాజ్ ఉపకరిస్తుంది. రాత్రికి కూడా కోడికి మంచి ఆహారం ఇస్తారు. ఏదిఏమైనా కోడి పందాలు, పుంజుల పెంపకం గ్రామీణ సంస్కృతిలో భాగమైపోయింది.